

తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

అనకాపల్లి రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి):
ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేసే నిమిత్తం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా జిల్లాలోని అన్ని మండల తహసీల్దార్, మునిసిపల్ కార్యాలయాల్లో ప్రజా ఫిర్యాదులు స్వీకరించడానికి ఏర్పాట్లు చేశామని జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రాల్లో తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల వద్ద ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

ఇష్టారాజ్యంగా చేపల చెరువులు


తారువలో ఇటీవల పట్టుకున్న చికెన్ వ్యర్థాలు

- పంట భూములను లీజుకు తీసుకుని చేపల పెంపకం
- కోళ్లు, పశు మాంసం వ్యర్థాలే ఆహారం
- చేపలు వేగంగా, ఏపుగా పెరగడానికి వినియోగం
- నీళ్లు కలుషితమై దెబ్బతింటున్న సమీపంలోని పంట పొలాలు
- పట్టించుకోని అధికారులు

అనుమతులు లేకుండా యథేచ్ఛగా నిర్వహణ


చేపల చెరువులు

దేవరాపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి):
మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా కొందరు చేపల చెరువులను దర్జాగా నిర్వహిస్తున్నారు. చేపలు ఏపుగా పెరగడానికి కోళ్లు, పశు మాంసం వ్యర్థాలను చెరువుల్లో వేస్తున్నారు. దీంతో నీళ్లు కలుషితమై సమీపంలోని పంట పొలాలు దెబ్బతింటున్నాయి. అధికారులకు ఈ విషయం తెలిసినా పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.


చెరువులో పెంచుతున్న పంగస్ (జెల్ల) రకం చేపలు


రవాణా చేస్తున్న చేపలు (ఫైల్ ఫొటో)

మండలంలోని పలు గ్రామాల్లో సుమారు ఆరేళ్ల క్రితం వ్యవసాయ భూముల్లో చేపల చెరువులు వెలిశాయి. మండల కేంద్రం దేవరాపల్లి, సంజీవపురం, పెదనందిపల్లి, చేనుల పాలెం, మారేపల్లి, తారువ, తిమిరాం, కలిగొట్ల, కొత్తపెంట, ములకలాపల్లి, ఎన్.గజపతినగరం, మామిడిపల్లి గ్రామాల్లో చేపలు చెరువులు ఉన్నాయి. ఇవన్నీ రైవాడ జలాశయం కింద ఆయకట్టు భూములే. మండలంలో సుమారు రెండు వందలకు పైగా ఎకరాల్లో చేపలు చెరువులు ఉన్నాయి. ఈ చెరువుల్లో పంగస్(జెల్ల) రకం చేపలు పెంచుతున్నారు. అయితే పంట భూములను చెరువులుగా మార్చి చేపలు పెంచడానికి మత్స్యశాఖ నుంచి అనుమతులు పొందవలసి ఉంది. అయితే ఎటువంటి అనుమతులు తీసుకోకుండా కొందరు చేపల చెరువుల కోసం రైతుల నుంచి భూములు తీసుకున్నారు. ఎకరా భూమికి సంవత్సరానికి రూ.50 వేలు నుంచి రూ.70 వేలు రైతుకు ఇచ్చి ఐదు సంవత్సరాల చొప్పున కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల వ్యాపారులు లీజుకు తీసుకుని చేపల చెరువులు నిర్వహిస్తున్నారు.


చేపల పెంపకానికి కోళ్ల వ్యర్థాలు

వాస్తవానికి చేపల పెంపకానికి అన్నం, తవుడు వంటివి వేయాల్సి ఉంది. అయితే చేపలు వేగంగా, ఏపుగా పెరగడానికి నిబంధనలకు విరుద్ధంగా కోళ్ల, పశు మాంస వ్యర్థాలను వేస్తున్నారు. ఈ వ్యర్థాలను విశాఖ, అనకాపల్లి, జీవీఎంసీ పరిసరాల నుంచి తెచ్చి వేస్తున్నారు. రైవాడ ఆయకట్టుకు నీరు విడుదల చేసినప్పుడు ఆ నీటిని చేపల చెరువులకు మళ్లిస్తున్నారు. కాగా చేపల చెరువుల్లోని వ్యర్థ జలాలను బయటకు విడిచిపెడుతుండడంతో సమీపంలోని పంట పొలాలు దెబ్బతింటున్నాయి. చేపల ... మిగతా 6వ పేజీలో

అడవి... అంతరిస్తోంది

ఉమ్మడి జిల్లాలో 116.07 చ.కి.మీ. తగ్గిన అటవీ విస్తీర్ణం

- అల్లూరి జిల్లాలో అత్యధికంగా తగ్గుదల
- అటవీ అగ్నిప్రమాదాల్లో దేశంలోనే ఈ జిల్లా రెండోస్థానం
- అర్బన్‌లో అడవుల విస్తీర్ణంలో ఏపీలో విశాఖ ప్రథమం


అల్లూరి జిల్లాలోని అటవీ ప్రాంతం

విశాఖపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి):
ఉమ్మడి విశాఖ జిల్లాలో అడవులు వేగంగా అంతరిస్తున్నాయి. 2021తో పోల్చితే 2023లో 116.07 చదరపు కిలోమీటర్ల అటవీ విస్తీర్ణం తగ్గింది. అందులో ఒక్క అల్లూరి సీతారామరాజు జిల్లాలోనే 101.69 చదరపు కిలోమీటర్ల మేర అటవీ విస్తీర్ణం తగ్గిపోయింది. రాష్ట్రంలో మొత్తం 138.66 చ.కి.మీ.ల మేర అడవులు తగ్గగా, వాటిలో 101 చ.కి.మీ. అల్లూరి సీతారామరాజు జిల్లాలోనే తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. అనకాపల్లి జిల్లాలో 9.62 చ.కి.మీ.లు, విశాఖపట్నంలో 4.72 చ.కి.మీ. వెరసి ఉమ్మడి జిల్లాలో 116.07 చ.కి.మీ. విస్తీర్ణం తగ్గినట్టు అటవీ నివేదిక -2023 (ఇండియా స్టేట్‌ఆఫ్ ఫారెస్టు రిపోర్టు) వెల్లడించింది. ఈ నివేదికను కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రి భూపేందర యాదవ్ శనివారం విడుదల చశారు.

అడవుల విస్తీర్ణం, చెట్లు, ఇతర అంశాలను 2021తో పోల్చుతూ 2023లో చేపట్టిన సర్వే నివేదిక ఇది. అల్లూరి సీతారామరాజు జిల్లా విస్తీర్ణం 12,446.54 చ.కి.మీ.లు కాగా, అందులో అత్యంత దట్టమైన అడవులు 1,173.18 చ.కి.మీ.లు, మధ్యస్థాయి అడవులు 3,781.97, ఓపెన్ అడవులు 1,952.17 వెరసి 6,917.32 చ.కి.మీలు (55.58శాతం) విస్తరించి ఉన్నాయి. మరో 726.83 చ.కి.మీ.లు పొదలు, డొంకలతో నిండి ఉంది. ప్రతి రెండేళ్లకు ఒకసారి దేశంలో అటవీ విస్తీర్ణాన్ని ఫారెస్టు సర్వే విభాగం సర్వేచేస్తోంది. 2021 నివేదికతో పోల్చితే అల్లూరి సీతారామరాజు జిల్లాలో 101.69 చ.కి.మీ. మేర అటవీ విస్తీర్ణం తగ్గింది. అనకాపల్లి జిల్లాలో 3,847.88 చ.కి.మీ. జిల్లా విస్తీర్ణం కాగా దాంట్లో దట్టమైన అడవులు లేవు. మధ్యస్థాయి అటవీ విస్తీర్ణం 155.02 చ.కి.మీ.లు, ఓపెన్ అడవులు 551.29చ.కి.మీ.లు వెరసి 706.31 (18.36శాతం) చ.కి.మీలు మేర విస్తీర్ణం ఉండగా, 2021తో పోల్చితే 9.62 చ.కి.మీ.లు తగ్గింది. విశాఖపట్నం జిల్లాలో 952.40 చ.కి.మీ. జిల్లా విస్తీర్ణం కాగా అత్యంత దట్టమైన అడవులు లేవు. మధ్యస్థాయి అడవులు 99.03, ఓపెన్ అటవీ విస్తీర్ణం 173.42 చ.కి.మీలు వెరసి 272.45 (28.61శాతం) చ.కి.మీ.లు విస్తీర్ణం ఉండగా 4.21 చ.కి.మీలు పొదలు, డొంకలతో కూడిన పచ్చదనం ఉంది. దీంట్లో 2021తో పోల్చితే 4.76 చ.కి.మీ.లు తగ్గింది.

జిల్లా భూభాగంలో అటవీ విస్తీర్ణంలో అల్లూరి సీతారామరాజు జిల్లా రాష్ట్రంలో 55.58 శాతంతో ప్రథమ స్థానంలో ఉంది. తరువాత నగరం ఎక్కువగా ఉన్న విశాఖ జిల్లా 28.61 శాతంతో రెండో స్థానంలో నిలవడం గమనార్హం. అటవీశాఖ నమోదుచేసిన ప్రాంతాల్లో చెట్ల సాంద్రత తగ్గడం అంటే (దట్టమైన చెట్లు కొట్టి వ్యవసాయానికి మళ్లించడం) ఒక కారణంగా అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా అల్లూరి, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఏజెన్సీ ఏరియాలో గిరిజనులు పోడు వ్యవసాయం కోసం అడవులు నరికివేస్తున్నారు. మైదాన ప్రాంతంలోని పొలాల్లో సరుగుడు, మామిడి, టేకు, ఆయిల్‌పాం తోటలు పెంచుతారు. కోతకు వచ్చినవి నరికివేస్తుంటారు. పంట సరిగ్గా రానిమామిడి, జీడి తోటలు తొలగిస్తారు. ఈ సమయంలో అటవీశాఖ సర్వే చేసినప్పుడు శాటిలైట్ ఇమేజ్‌లో అక్కడ ఖాళీ భూములున్నట్టుగా నమోదవుతుంది. దీంతో అటవీ విస్తీర్ణం తగ్గుదల నమోదవుతుంది. ఏటా కోట్ల మొక్కలు నాటినా అటవీ విస్తీర్ణం పెరగకపోవడం ఇప్పటికీ శేష ప్రశ్నగా ఓ అధికారి వ్యాఖ్యానించారు.

అగ్నిప్రమాదాల్లో అల్లూరి రెండోస్థానం..

దేశంలోని అడవుల్లో పలుచోట్ల తరచూ అగ్నిప్రమాదాలు సంభవిస్తుంటాయి. ఇందులో అల్లూరి సీతారామరాజు జిల్లా రెండోస్థానంలో ఉంది. తాజా నివేదిక మేరకు 2022 నవంబరు నుంచి ఈ ఏడాది జూన్ వరకు 6,399 అగ్నిప్రమాదాలు సంభవించాయి.

2022 నవంబరు నుంచి 2023 జూన్ వరకు 3,639 ప్రమాదాలు సంభవించాయి. అల్లూరి జిల్లాలో శీతాకాలం ... మిగతా 6వ పేజీలో

ముగ్గురు భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర గాయాలు

- డెక్కింగ్ కర్రలు విరగడంతో ప్రమాదం


డెక్కింగ్ కర్రలు విరిగిపడిన దృశ్యం

కొత్తూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి):
అనకాపల్లి మండలం రేబాక పంచాయతీ కాపుశెట్టివానిపాలెం గ్రామంలో ఆదివారం భవన నిర్మాణ పనులు చేస్తుండగా డెక్కింగ్ కర్రలు విరిగి ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించి అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ రైటర్ సత్యనారాయణ తెలిపిన వివరాలివి. కాపుశెట్టివానిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆస్పత్రి భవనం రెండో అంతస్థులో బయట నుంచి ప్లాస్టింగ్ చేసేందుకు డెక్కింగ్ కర్రలను భవన నిర్మాణ కార్మికులు ఏర్పాటు చేసుకున్నారు. ఆదివారం పనిచేస్తుండగా కర్రలు ఒక్కసారిగా విరగడంతో శ్రీకాకుళం జిల్లా నౌపడకు చెందిన లోపింటి సోమేశ్వరరావు, నౌపడ మండలం పాతలింగుడు గ్రామానికి చెందిన జేరు చిన్నారావు, రాయగడకు చెందిన కృష్ణ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. కాగా ఇటీవల కురిసిన వర్షానికి ఆ డెక్కింగ్ కర్రలు నానిపోవడంతో ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని స్థానికులు అంటున్నారు.

అనకాపల్లిలో రైతు బజార్ ఏర్పాటయ్యేనా?

ఎన్నో ఏళ్లుగా రైతులు, వినియోగదారుల ఎదురుచూపులు

- స్థల సమస్యతో కొలిక్కిరాని వైనం

అనకాపల్లి టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి):
జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో రైతుబజార్ ఏర్పాటు కలగానే మిగిలింది. దశాబ్దాలుగా రైతులు, వినియోగదారులు ఎదురు చూస్తున్నా ఇప్పటికీ మోక్షం కలగడం లేదు. దీంతో రైతులకు గిట్టుబాటు ధర అందక, వినియోగదారులకు ధరల భారం అధికం కావడంతో అవస్థలు తప్పడం లేదు.


రద్దీగా ఉన్న కూరగాయల మార్కెట్

విశాఖ నగరంలో పలుచోట్ల రైతుబజార్లు ఉండడంతో అక్కడి ప్రజలకు కూరగాయలు నిర్ణీత ధరలకు లభిస్తుండడంతో పాటు రైతులకు కూడా గిట్టుబాటు ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. అయితే ఏళ్ల తరబడి అనకాపల్లిలో కూరగాయల మార్కెట్ ఉన్నప్పటికీ ఇక్కడ రైతులకు గాని, వినియోగదారులకు గాని ఎటువంటి ప్రయోజనం లేకుండాపోతోంది. అనకాపల్లికి రైతుబజార్ మంజూరై రెండేళ్లు దాటినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. అనకాపల్లిలోని గాంధీ మార్కెట్‌కు నిత్యం అనకాపల్లి, చుట్టుపక్కల మండలాల నుంచి


కూరగాయల మార్కెట్

రైతులు పండించిన కూరగాయలను తీసుకువచ్చి అమ్మకాలు సాగిస్తుంటారు. అయితే స్థానిక వ్యాపారులు నిర్ధారించిన ధరలకే అమ్ముకోవాల్సి వస్తున్నది. మరో వైపు వినియోగదారులు అధిక ధరలకు చిరు వ్యాపారుల నుంచి కూరగాయలను కొనుగోలు చేస్తున్నారు. రైతుబజార్ ఏర్పాటైతే రైతులు నేరుగా వినియోగదారులకు కూరగాయలను అమ్ముకోవచ్చు. దీని వల్ల రైతులకు గిట్టుబాటు ధరలు లభించడంతో పాటు వినియోగదారులకు మార్కెట్‌లో కన్నా తక్కువ రేటుకు కూరగాయలు అందుబాటులో ఉంటాయి. ఈ నేపథ్యంలో అనకాపల్లిలో రైతుబజార్ ఏర్పాటు చేయాలని ఈ ప్రాంతంలో కూరగాయ పంటలు సాగు చేసే రైతులతో పాటు పట్టణానికి చెందిన వినియోగదారులు చాలా కాలం నుంచి డిమాండ్ చేస్తున్నారు. ఎట్టకేలకు రాష్ట్ర విభజన తరువాత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రైతుబజార్ ... మిగతా 6వ పేజీలో

పలు రైళ్లు ఆలస్యం

అనకాపల్లిలో ప్రయాణికుల పడిగాపులు

- విశాఖ రైల్వే స్టేషన్ వద్ద హై టెన్షన్ విద్యుత్ తీగలు తెగి పడడమే కారణం


అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారంపై వేచి ఉన్న ప్రయాణికులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి):
అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో ఆదివారం పలు రైళ్లు సుమారు గంటన్నర పాటు నిలిచిపోయాయి. దీంతో పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి. దీని వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. విశాఖ రైల్వేస్టేషన్‌లో హై టెన్షన్ విద్యుత్ తీగలు తెగిపడడంతో ఈ సమస్య తలెత్తింది. ఈ కారణంగా గ్రామీణ జిల్లాలోని పలు రైల్వేస్టేషన్లలో రైళ్లను గంటల తరబడి నిలిపివేశారు. ఉదయం చెన్నై నుంచి హౌరా వెళ్లే మెయిల్ 6.40 గంటలకు అనకాపల్లికి రావాల్సి ఉండగా, 8.15 గంటలకు చేరుకుంది. విశాఖలో తలెత్తిన సమస్య కారణంగా ఆ రైలును అనకాపల్లిలో నిలిపివేసి 9.25 గంటలకు విశాఖకు విడిచిపెట్టారు. గుంటూరు నుంచి రాయగడ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు ఉదయం ఎనిమిది గంటలకు రాగా, 9.34 గంటలకు అనకాపల్లి నుంచి విశాఖకు బయలుదేరింది. విశాఖకు వెళ్లే తిరుమల ఎక్స్‌ప్రెస్ 10.25 గంటలకు రాగా, 10.47 గంటలకు బయలుదేరింది. అనకాపల్లిలో హాల్ట్ లేని సంబల్‌పూర్- నాందేడ్- సంబల్‌పూర్ నాగావళి ఎక్స్‌ప్రెస్ 10.30 గంటలకు రాగా, 11.56 గంటలకు విడిచిపెట్టారు. ఉదయం 9.20 గంటలకు రావాల్సిన బొకారో ఎక్స్‌ప్రెస్ 10.50 గంటలకు విశాఖ నుంచి అనకాపల్లికి చేరుకుంది. మధ్యాహ్నం విజయవాడ వెళ్లే రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ 1.40 గంటలకు అనకాపల్లికి రావాల్సి ఉండగా, మధ్యాహ్నం 3.15 గంటలకు చేరుకుంది. ఇదిలా ఉండగా తాడి రైల్వేస్టేషన్‌లో కూడా మచిలీపట్నం- విశాఖ రైలు, సికింద్రాబాద్- విశాఖ గరీబ్‌రథ్ రైలు కూడా కొద్దిసేపు నిలిచిపోయినట్టు తెలిసింది. కాకినాడ పోర్టు నుంచి విశాఖకు వెళ్లే కాకినాడ ఎక్స్‌ప్రెస్ కూడా బయ్యవరంలో కొద్దిసేపు నిలిపివేసిన తరువాత విశాఖకు వెళ్లినట్టు రైల్వేవర్గాలు చెబుతున్నాయి. గంటకు పైగా రైళ్లు ప్లాట్‌ఫారాలపై నిలిపివేయడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా నాగావళి ఎక్స్‌ప్రెస్ రైలుకు అనకాపల్లిలో హాల్టు ... మిగతా 6వ పేజీలో

దడ పుట్టించే దారి

గోతులమయంగా అసకపల్లి- లంకెలపాలెం రోడ్డు

- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని ఆర్ అండ్ బీ అధికారులు

సబ్బవరం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి):
మండలంలోని అసకపల్లి- లంకెలపాలెం రోడ్డుపై ఏర్పడిన గోతులు చెరువులను తలపిస్తున్నాయి. గత మూడేళ్లుగా ఈ రోడ్డు అధ్వానంగా ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఆర్ అండ్ బీ అధికారులు ఈ రోడ్డును పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.


ఎరుకునాయుడుపాలెం- అసకపల్లి మధ్య రోడ్డుపై ఏర్పడిన గోతుల కారణంగా బోల్తా పడిన వ్యాన్ (ఫైల్)


ఎరుకునాయుడుపాలెం సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గోతులు

అసకపల్లి, ఎరుకునాయుడుపాలెం, పైడివాడఅగ్రహారం, పెదముషిడివాడ తదితర గ్రామాల వద్ద రోడ్డుపై భారీగా గోతులు ఏర్పడడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు అవి చెరువుల్ని తలపిస్తున్నాయి. దీంతో ఇటుగా ప్రయాణమంటే వాహనచోదకులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ మార్గం గోతులమయంగా ఉండడంతో లంకెలపాలెం, పరవాడ వెళ్లే వాహనచోదకులు అనకాపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే గాజువాక నుంచి సబ్బవరం రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సు కొన్ని రోజులుగా ఈ మార్గంలో తిరగడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కాగా మూడు రోజుల క్రితం లంకెలపాలెం వైపు నుంచి సబ్బవరం వస్తున్న వ్యాన్ ఎరుకునాయుడు పాలెం సమీపంలో బోల్తా పడింది. ఇటువంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

సీఎస్ఆర్ నిధులతో పనులు చేపట్టాలని..

అసకపల్లి- లంకెలపాలెం రోడ్డు మరమ్మతులకు సంబంధించి పెదముషిడివాడ వరకు పనులు చేశామని ఆర్ అండ్ బీ అధికారులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. సబ్బవరం పరిధిలో రోడ్డుపై భారీగా గోతులు ఏర్పడడంతో ప్రభుత్వం కేటాయించిన నిధులు సరిపోకపోవడంతో స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, ఎంపీ సీఎం రమేశ్‌లు ఎన్టీపీసీ నుంచి సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ) నిధులు అడిగారని, ఎన్టీపీసీ యాజమాన్యం సానుకూలంగా స్పందించిందన్నారు. వారు నిధులు మంజూరు చేస్తే మరమ్మతు పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.

పుణ్యకోటి వాహనంపై పురుషోత్తముడు

» ఉపమాక క్షేత్రంలో నేత్రపర్వంగా ధనుర్మాసోత్సవాలు



నక్కపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని ఉపమాక క్షేత్రంలో ఆదివారం తిరువీధి సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో అర్చకులు నిత్య హోమాలు, పూజలు జరిపారు. అనంతరం ఉభయ దేవేరులతో కూడిన వేంకటేశ్వరస్వామి వారిని పుణ్యకోటి వాహనంపై అలంకరించి, పల్లకీలో గోదాదేవి అమ్మవారిని ఉంచి తిరువీధుల్లో మంగళ వాద్యాల నడుమ ఊరేగించారు. ఆ తరువాత గోదాదేవి అమ్మవారి సన్నిధిలో తిరుప్పావై పాశుర విన్నపం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, శ్రీవారి సేవకులతో పాటు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాఢవీధుల్లో తిరువీధి సేవ నిర్వహిస్తున్న దృశ్యం

జాబ్ మేళా క్యాలెండర్ ఆవిష్కరణ

» యువత సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నేతలు విజ్ఞప్తి



జాబ్ మేళా క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

పాయకరావుపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు ఈ నెల 28న ఇక్కడి శ్రీప్రకాశ్‌లో జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన క్యాలెండర్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, నాయకులు ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. పార్టీ నాయకులు చింతకాయల రాంబాబు, పెదిరెడ్డి శ్రీను, కంకిపాటి వెంకటేశ్వరరావు, బొంది కాశీవిశ్వనాథ్, యాళ్ల వరహాలు, చిక్కాల శ్రీను, జూరెడ్డి ప్రసాద్, వేములపూడి అప్పారావు, దువ్వ శ్రీనివాస్, ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా చేపల చెరువులు

... 5వ పేజీ తరువాయి

చెరువుల నిర్వహణకు మత్స్యశాఖ, పోలీసు, రెవెన్యూ అధికారుల నుంచి అనుమతులు పొందాల్సి ఉన్నా నిర్వాహకులు పట్టించుకోకపోవడం, అధికారులు కూడా చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది.

చేపల చెరువులకు అనుమతులు లేవు

చేపల చెరువుల నిర్వహణకు ఎవరూ అనుమతులు తీసుకోలేదని, అనుమతులు తీసుకోవాలని 15 మంది చేపల చెరువుల యజమానులకు నోటీలు ఇచ్చామని మత్స్య శాఖ ఏడీ ప్రసాదరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇటీవల తారువలో కోళ్ల వ్యర్థాలను పట్టుకొని ,వాటిని ధ్వంసం చేసి రవాణా చేస్తున్న ఆటోను పోలీసులకు అప్పగించామన్నారు. ఇక్కడ పెంచుతున్న చేపలు పంగస్ రకానికి చెందినవి ఆయన తెలిపారు.

అధికారులు పట్టించుకోవడం లేదు

చేపల చెరువులపై అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న ఆరోపించారు. కోళ్ల వ్యర్థాలను పట్టపగలే మాంసం దుకాణాల నుంచి తీసుకు వెళుతుంటే పట్టుకొని పోలీసులకు అప్పగించాల్సి వస్తుందన్నారు. సచివాలయాల సిబ్బంది కూడా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

అనకాపల్లిలో రైతుబజార్ ఏర్పాటయ్యేనా?

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటుకు అప్పట్లో ప్రజాప్రతినిధులు చర్యలు ప్రారంభించారు. విజయవాడ నుంచి మార్కెటింగ్‌శాఖ అధికారులు అనకాపల్లికి వచ్చి రైతుబజార్‌కు అవసరమైన స్థలాల కోసం అన్వేషణ చేశారు. గాంధీమార్కెట్‌కు ఎదురుగా ఉన్న డీసీఎంఎస్ స్థలం పరిశీలించారు. అయితే ఆ స్థలాన్ని డీసీఎంఎస్ ఇవ్వడానికి అంగీకరించలేదు. ఆ తరువాత అరటి, కొబ్బరికాయల మార్కెట్ స్థలాన్ని కూడా పరిశీలించారు. అయినా ప్రయోజనం లేకపోయింది. ఆ తరువాత ప్రభుత్వం మారడంతో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అనకాపల్లికి రైతుబజారును మంజూరు చేస్తూ 2021 మార్చి 5వ తేదీన మార్కెటింగ్‌శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే రైతుబజార్ ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. ఇప్పటికీ స్థల సమస్య కొలిక్కి రాకపోవడంతో రైతుబజార్ ఏర్పాటు ప్రశ్నార్థకంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అయినా రైతుబజార్ అందుబాటులోకి వస్తుందని అందరూ ఆశగా ఎదురు చూస్తున్నారు. దీనిపై మార్కెటింగ్‌శాఖ జిల్లా అధికారి రవికుమార్ వివరణ కోరగా గతంలో అధికారులు అరటి, కొబ్బరికాయల మార్కెట్ స్థలాన్ని పరిశీలించారని, ఆ స్థలం జీవీఎంసీది కావడంతో లేఖ రాసినట్టు చెప్పారు. జీవీఎంసీ ఆ స్థలాన్ని కేటాయించినట్టయితే రైతుబజార్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

అడవి... అంతరిస్తోంది

... 5వ పేజీ తరువాయి

ముగిసిన తరువాత వాతావరణంలో మార్పుల కారణంగా అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయి. అనకాపల్లి జిల్లాలో 2022 నవంబరు నుంచి 2023 జూన్ వరకు 194 అగ్నిప్రమాదాలు సంభవించగా, 2023 నవంబరు నుంచి 2024 జూన్ వరకు 126కు తగ్గాయి. విశాఖ జిల్లాలో 2022 నవంబరు నుంచి 2023 జూన్ వరకు మూడు, 2023 నవంబరు నుంచి 2024 జూన్ వరకు నాలుగు ప్రమాదాలు సంభవించాయి.

అర్బన్‌లో విశాఖ ప్రథమ స్థానం

జిల్లాలో భీమిలి నుంచి అనకాపల్లి వరకు 615.53 చ.కి.మీ. విస్తీర్ణంతో విస్తరించిన విశాఖ నగరం జనసమ్మర్థంగా ఉంటుంది. అటువంటి మహానగరంలో అడవుల విస్తీర్ణం ఎక్కువ. రాష్ట్రంలో ఎక్కువగా అటవీ విస్తీర్ణం ఉన్న పట్టణాలు/నగరాల్లో విశాఖపట్నం ప్రథమస్థానంలో ఉంది. నగరంలో 68.59 చ.కి.మీ. విస్తీర్ణంలో మధ్యస్థాయి అడవి ఉండగా ఓపెన్ ఫారెస్టు 114.10 చ.కి.మీ. మేర విస్తరించాయి. మొత్తం 182.69 చ.కి.మీ. అటవీ విస్తీర్ణం ఉంది. మొత్తంలో అటవీ విస్తీర్ణం 29.68 శాతంగా ఉంది. నగరంలో కంబాలకొండ ఒక్కటే 1400 హెక్టార్లలో విస్తరించింది. జూ, సింహాచలం కొండ, విశాఖ ఉక్కు టౌన్‌షిప్, ఆంధ్ర విశ్వవిద్యాలయం, పార్కుల్లో లక్షల చెట్లతో పచ్చదనం నిండి ఉంది. హుద్‌హుద్ తరువాత నాటిన మొక్కలు వృక్షాలుగా ఎదగడంతో పచ్చదనం పరచుకుంది. వీటన్నింటిని కలిపి ఓపెన్ ఫారెస్టుగా గుర్తిస్తారు. అయినా నగరంలో కాలుష్యం, వేసవిలో వేడి తగ్గాలన్నా మరిన్ని మొక్కలు పెంచాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

సమస్యలపై స్పందిస్తేనే.. రోడ్డు విస్తరణకు సహకారం

» తహసీల్దార్ ఎదుట స్పష్టంచేసిన నిర్వాసితులు



నిర్వాసితులతో సమావేశమైన తహసీల్దార్ ఉమామహేశ్వరరావు

మునగపాక, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల పరిష్కారానికి చొరవ తీసుకుంటే తాము రోడ్డు విస్తరణకు సహకరిస్తామని అనకాపల్లి- అచ్యుతాపురం పూడిమడక రోడ్డు మార్గం విస్తరణ నిర్వాసితులు స్పష్టం చేశారు. స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో ఆదివారం నిర్వాసితులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ ఆది ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణకు సంబంధించి గతంలో ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించిందన్నారు. ఈ నేపథ్యంలో విస్తరణకు నిర్వాసితులు సహకరించాలన్నారు. నిర్వాసితులు డిమాండ్లను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్తామన్నారు. నిర్వాసితుల్లో ఒకరైన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ... రోడ్డు విస్తరణతో కొంతమంది సర్వంకోల్పోవాల్సి పరిస్థితి ఉన్నందున అటువంటి వారికి పరోక్షంగా ఆదుకునేందుకు చొరవ చూపాలన్నారు. కొన్ని చోట్ల ఎక్కువ అడుగులమేర స్థలం పోతోందని, అటువంటి వాటిపై పునఃపరిశీలన చేయాలన్నారు. భవనాలు తొలగించే క్రమంలో ఇంటిలో సగభాగం కోల్పోనవారికి పూర్తిస్థాయి పరిహారం ఇవ్వాలన్నారు. ఈ డిమాండ్‌లకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు దాడి ముసిలినాయుడు, ఎ.వి.సత్యనారాయణ, టెక్కలి పరశరాం, నిర్వాసితులు ఆడారి గణపతి అచ్చింనాయుడు, పెంటకోట జగన్నాథంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వేడుకలో పూర్వ విద్యార్థులు

మునగపాక, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1973-74 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు గోల్డెన్ జూబ్లీ పేరుతో ఆదివారం ఆత్మీయ వనసమారాధన నిర్వహించినట్టు ఆ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి, ఎంపీటీసీ సభ్యుడు సూరిశెట్టి రమణ తెలిపారు. అనకాపల్లి సత్యనారాయణమూర్తిస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ సమారాధనలో 35కు పైగా కుటుంబాలనుంచి 70 మందికి పైగా హాజరయ్యారు. ఆటపాటలతో సందడిగా గడిపారు. చదువు చెప్పిన గురువులు కె.వి. గౌరీపతి, జి.వి.అప్పారావులను ఆహ్వానించి సన్మానం చేశామన్నారు.

హృదయం చారిటబుల్ ట్రస్టు సభ్యుల సమారాధన

హృదయం చారిటబుల్ ట్రస్టు సేవలు విస్తరించే దిశగా ప్రణాళికలు చేస్తామని ఆ సంస్థ అ ధ్యక్షుడు శిష్టా తమ్మిరాజు తెలిపారు. మండలంలో పాటిపల్లి అహోబిల లక్ష్మీనరంహస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం సంస్థ ఆ త్మీయ వనసమారాధన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడు ఎ.వి.ఎస్.మూర్తి స్థాపించిన ఈ సంస్థ ఎం దరికో మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. సంస్థ సేవలకు దశాబ్దాల చరిత్ర ఉందన్నారు. ఈ సమారాధనలో సంస్థ కమిటీ సభ్యులు, ప్రోత్సాహకులు సాయంత్రం వరకు ఆట, పాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కె.వి.రమణ, పెంటకోట తులసీరావు, మా ఊళ్లో గ్రంథాలయం సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు బీశెట్టి ధనశ్రీను, యల్లపు సంజీవరావు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లలోకి వర్షపు నీరు

» లబ్ధిదారులు గగ్గోలు



ఇంటిలోకి నీరు చేరడంతో నాచుపట్టిన దృశ్యం

ఎలమంచిలి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక టిడ్కో గృహ సముదాయంలో ప్లాట్లు లీకవుతుండడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు లీకులన్నీ బైటపడుతున్నాయి. ఇళ్ల స్లాబుల నుంచే కాకుండా విద్యుత్ మీటర్ల నుంచి నీరు లీకవుతుండడంతో ఇంట్లో సామగ్రి అంతా తడిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గృహ ప్రవేశాలు చేసి ఏడాదిన్నర కాకముందే పైకప్పులు కారిపోతున్నాయని, ఎన్ని సార్లు టిడ్కో అధికారులకు తెలియజేసినా సమస్యను శాశ్వతంగా పరిష్కరించడంలేదని ఆరోపిస్తున్నారు. లీకవుతున్న కొన్ని ఇళ్లకు టిడ్కో సిబ్బంది వచ్చి మరమ్మతు చేసినా సరే మళ్లీ యథావిధిగా అవుతున్నాయని తెలిపారు. అసలే బ్యాంకు వాయిదాలు చెల్లించేందుకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, వీటికి తోడు ప్లాట్లు లీకవుతుంటే ఇంకెలా ఇళ్లల్లో లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. మునిసిపల్, టిడ్కో అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, డిసెంబరు 22 (అచ్యుతాపురం): మండలంలోని ఎర్రవరంలో కనక దుర్గ అమ్మవారికి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆదివారం పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయంలో చండీహోమం సందర్భంగా భవానీ మాలధారణ చేసిన భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో పాల్గొన్న ఆయన అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బైలపూడి శ్రీరామదాసు, జనపరెడ్డి శ్రీనివాసరావు, కాద్రేగుల జోగినాయుడు, టెక్కలి పరశురామ్, మోటూరు శ్రీవేణి, పైల రామునాయుడు, గూడేల కనకారావు, కాంద్రేగుల సూర్యనారాయణ, ద్వారపురెడ్డి బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసీపీ శ్రేణులు



ఎమ్మెల్యే సమక్షంలో జనసేనలో చేరిన గోవిందపాలెంనకు చెందిన వైసీపీ శ్రేణులు

రాంబిల్లి/ అచ్యుతాపురం డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాంబిల్లి మండల పరిధి గోవిందపాలెంనకు చెందిన వైసీపీ శ్రేణులు ఆదివారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, ఎంపీటీసీ సభ్యులు నానేపల్లి సన్యాసిరావు, నేతలు గబ్బర్‌సింగ్, నాని, రేఖరాజు, నరసింహారావులు ఆధ్వర్యంలో గోవిందపాలెం మాజీ సర్పంచ్ కిల్లాడి అప్పలరాజు, పలువురు వార్డుల సభ్యులు, 70 మంది వైసీపీ శ్రేణులు అచ్యుతాపురంలోని ఎమ్మెల్యే నివాసంలో సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. జనసేనలో చేరిని వీరికి ఎమ్మెల్యే విజయకుమార్ పార్టీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ సీఎం జగన్‌కి, ఆ పార్టీ నాయకులకు గత ఎన్నికల్లో ప్రజలు తేరుకోలేని విధంగా గుణపాఠం చెప్పినా వీరి తీరు మారలేదన్నారు. ఈ స్థితిలో మరికొద్ది రోజుల్లో వైసీపీ ఖాళీ కానుందన్నారు. జనసేన ప్రజా క్షేమం కోరుకునే పార్టీ అని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటినుంచి గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నామన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రజలు జనసేనలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఇస్తామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ అచ్యుతాపురం మండల అధ్యక్షులు బైలపూడి శ్రీరామదాసు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో బోల్తా... ప్రయాణికులకు స్వల్పగాయాలు



మామిడివాడ సమీపంలో ప్రమాదానికి గురైన ఆటో

రాంబిల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడివాడ సమీపంలో ఆదివారం ఆటో బోల్తా పడి కాలువలో దూసుకుపోయింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న పలువురు స్వల్ప గాయాలతో బయటపడినట్టు సమాచారం. రాంబిల్లిలోని యాతపేటకు చెందిన సుమారు 15 మంది ఎలమంచిలినుంచి రాంబిల్లి వైపు వస్తున్న ఆటో మామిడివాడ సమీపంలో ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ఆ సమయంలో ఎలమంచిలి నుంచి అచ్యుతాపురం వెళ్తున్న ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఈ ప్రమాద సంఘటన వద్ద వెళ్లారు. గాయపడిన వారిని తన వాహనంలో రాంబిల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలందించాలని ఆసుపత్రి సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. ఈ విషయమై స్థానిక ఎస్ఐ నాగేంద్ర వద్ద ప్రస్తావించగా ప్రమాదం జరిగిన విషయం వాస్తవమేనన్నారు. ఎవరికీ పెద్దగా గాయాలు కాలేదని తగలలేదన్నారు. దీనిపై ఫిర్యాదు అందలేదన్నారు.

నూకాంబికా ఆలయానికి దీపం కుందుల బహూకరణ

మునగపాక, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలో తిమ్మరాజుపేటలో శ్రీనూకాంబికా అమ్మవారి ఆలయానికి మాజీ సర్పంచ్ శరగడం వెంకటరమణ జ్ఞాపకార్థం అతని కుమారుడు తారక వెంకట్ రాజేశ్వరరావు దంపతులు దీపం కుందులు ఆదివారం అందజేశారు. గ్రామానికి చెందిన రాజేశ్వరరావు భీమవరం జిల్లా డ్వామా పీడీగా ఉద్యోగం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ కాంద్రేగుల జగన్, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వర్షాలు అన్నదాత వెన్నువిరి'చేను'

» కోటవురట్ల మండలంలోని పలు గ్రామాల్లో నష్టం

» నేలవాలిన, తడిసిన పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు



తంగేడులో నేల వాలిన వరిచేను



జల్లూరులో వాలిన వరి దుబ్బులను కట్టాలుకట్టిన రైతులు

కోటవురట్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం కారణంగా కురిసిన వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట తీవ్రంగా దెబ్బతింది. శుక్రవారం రాత్రి వర్షానికి నేలవాలిన వరిచేళ్లలో నీరు చేరింది. శనివారం తగ్గుముఖం పట్టినప్పటికీ గాలులు కొనసాగడంతో పంట పలుచోట్ల నేలవాలింది. దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటను చూసి ఆయా రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పండించామని, చేతికందే సమయంలో నేలపాలు అయ్యిందని వాపోయారు. కోటవురట్ల, లింగాపురం, తంగేడు, జల్లూరు, యండపల్లి, బీకేపల్లి గ్రామాల్లో పంటకు తీవ్ర నష్టం జరిగిందని ఆయా రైతులు చెపుతున్నారు. దీంతో కొందరు ఒరిగిన వరి చేళ్లను కాపాడుకునే పనిలో నిమగ్నమయ్యారు. నాలుగైదు దుబ్బులను కలిసి కట్టగా చుడుతున్నారు. ఇదిలావుంటే, పలు చోట్ల కోసిన వరి పనలు తడిసి ముద్దవ్వడంతో ధాన్యం ఎలా ఉంటుందోనని ఆయా రైతులు మదన పడుతున్నారు. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటను కాపాడుకునేందుకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని పలువురు కోరుతుండగా, ప్రభుత్వం నష్టాన్ని గుర్తించి పరిహారం అందించాల్సిందిగా మరికొందరు విన్నవిస్తున్నారు.

పేట సూదిపురం ప్రధాన రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



రోడ్డు నిర్మాణ శంకుస్థాపనలో నాయకులు

ఎస్.రాయవరం, డిసెంబరు 22 (ఆంధ్ర జ్యోతి) : ఏళ్ల తరబడి పెద్ద పెద్ద గోతులతో అధ్వానంగా ఉన్న మండలంలోని పేటసూదిపురం గ్రామానికి వెళ్లే రహదారికి ఎట్టకేలకుమోక్షం కలగనుంది. ఇందులో భాగంగా రూ.52.5 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఈ రోడ్డు నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించిన పనులకు ఆదివారం స్థానిక సర్పంచ్ కరణం మేఘమాల భవాని, శివ దంపతులతో పాటు టీడీపీ నాయకులు బోయిన రామావతారం తదితరులు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వజ్రపు శంకర రావు, వీసం అప్పలనాయుడు, కె.శ్రీను, కొత్త పల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



నక్కపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



పాయకరావుపేట మండలం గుంటపల్లి పాఠశాలలో ఉపాధ్యాయుడికి సన్మానం

నక్కపల్లి/ పాయకరావుపేట రూరూల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1982-83 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారంతా నాలుగు దశాబ్దాల అనంతరం కలుసుకున్నారు. ఈ సందర్భంగా తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఒకరి యోగక్షేమాలను ఒకరు తెలుసుకుని, నాటి మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. అనంతరం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఆనందగా గడిపారు. ఈ కార్యక్రమంలో కేవీ సత్యనారాయణ, బొల్లం కోటేశ్వరరావు, డి.రామారావు, మల్లేశ్వరి, స్వర్ణలత, జ్యోతి, భారతి, సత్యానంద్, న్యూటన్, రెడ్డి త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

అలాగే, పాయకరావుపేట మండలం గుంటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989-1990 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. ముందుగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు ఎస్.రామనాగు, ఎం.అప్పారావులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తోట వెంకట సత్యగంగాధర్, తోట వెంకట చలపతిరావు, పోతంశెట్టి వెంకటేశ్వరరావు, గట్టెం గంగారావు, దేవవరపు అనంత రామలక్ష్మి, గట్టెం ఏసుదాసు, పల్యాల వెంకటరమణ, తోట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మాల మహానాడు వ్యవస్థాపకులు పీవీ రావుకు నివాళి



పీవీరావు చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

పాయకరావుపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) మాల మహానాడు వ్యవస్థాపకులు పీవీ రావు వర్ధంతిని ఇక్కడి అంబేడ్కర్ పార్కులో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాల మహానాడు ప్రధానకార్యదర్శి పెదపాటి మేఘరంజన్ మాట్లాడుతూ దళితులను చైతన్యవంతులను చేసిన మహనీయుడు పీవీరావుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెరుకూరి పేర్రాజు, ఐ.ఎన్.మూర్తి, తాటిపాక లోవరాజు, పల్లా ప్రసాద్, కువ్వల కుమార్, గారా రమేశ్, గాతాడ అప్పారావు, దండా లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా గోవింద్ నియామకం



గోవింద్‌ను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

నక్కపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా మండలంలోని అమలాపురం పంచాయతీ మూలపర్రకు చెందిన సూరకాసుల గోవింద్‌ను పార్టీ అధిష్ఠానం నియమించింది. గతంలో అమలాపురం సర్పంచ్‌గా ఈయన భార్య రామలక్ష్మి పనిచేశారు. ఈ సందర్భంగా ఆదివారం పార్టీ నాయకులు వీసం రామకృష్ణ, అయినంపూడి మణిరాజు, పొడగట్ల పాపారావు, సురేశ్‌రాజు, జడ్పీటీసీ గోసల కాసులమ్మ, గంటా తిరుపతిరావు తదితరులు గోవింద్‌ను సత్కరించారు.

పలు రైళ్లు ఆలస్యం

... 5వ పేజీ తరువాయి

లేకపోయినా నిలిపివేయడం పట్ల ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురయ్యారు. ఒకటో ప్లాట్‌ఫారంలో కనీసం బిస్కెట్లు, కూల్‌డ్రింక్‌లు తప్ప మరే ఫలహారాలు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. 11 గంటల తరువాత విశాఖలో విద్యుత్ తీగలు సరి చేయడంతో ఆ తరువాత నుంచి రైళ్లు యథావిధిగా రాకపోకలు సాగించాయి.

వరాహావతారంలో వేంకటేశ్వరస్వామి



కశింకోట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఇక్కడి వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో శ్రీనివాసుడు ఆదివారం వరాహావతారంలో దర్శనమిచ్చారు. మూడు రోజుల పాటు ఈ అలంకరణలో స్వామి ఉండనున్నారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి రేజేటి శ్రీరామా చరణాచార్యులు, రేజేటి మారుతి వెంకటాచార్యులు విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

గౌరీ పరమేశ్వరుల ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ



గౌరమ్మ ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీలా గోవింద, తదితరులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విజయరామరాజుపేట గౌరీ పరమేశ్వరుల మహోత్సవ పోస్టర్‌ను ఆదివారం ఇక్కడ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ వేర్వేరుగా ఆవిష్కరించారు. ఈ నెల 28వ తేదీన గౌరీ పరమేశ్వరుల జాతరను వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా కార్యక్రమాల పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల రామచంద్రరావు, ఆడారి వీర వెంకట సత్యనారాయణస్వామి, ఆడారి శ్రీను, ఆళ్ల నూకరాజు, దొడ్డి హరిబాబు, విజయ గౌరీ యువజన సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'హైందవ శంఖారావం విజయవంతం చేయండి'



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

పరవాడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వచ్చే నెల ఐదో తేదీన విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ ధర్మప్రచారక్ వెన్నెల అప్పలనాయుడు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం పరవాడ రామాలయం వద్ద వీహెచ్‌పీ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. హిందూ సంస్కృతీ సంప్రదాయాలను నేటితరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. దేవాలయాల కేంద్రంగా సామూహిక హారతి కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. వీహెచ్‌పీ ప్రతినిధులు పోతల చిట్టమ్మ, భద్రావతి, వి.అమ్మాజీ, వానపల్లి సూరిబాబు, దేవరపల్లి ప్రసాద్, బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగరంలో సెమీ క్రిస్మస్ వేడుకలు



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న మళ్ల సురేంద్ర

అనకాపల్లి టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గాంధీనగరంలోని ఫుల్ గోస్పెల్ చర్చిలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గోల్డ్ వాసు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర హాజరయ్యారు. క్రీస్తు చూపించిన మార్గం అనుసరణీయమని ప్రతి ఒక్కరూ జాలి, దయ, ప్రేమ కలిగి ఉండాలని సూచించారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. పాస్టర్ చంద్రశేఖర్, విక్టోరియా మేరీగ్రేస్, గొర్లి సువర్ణ రాణి, రవితేజ, భానుచందర్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

యాదవులంతా ఐక్యంగా ముందుకు సాగాలి

ఆత్మీయ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు భరిణికాన బాబూరావు



భరిణికాన బాబురావును సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

తుమ్మపాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండ వద్ద ఆదివారం యాదవుల ఆత్మీయ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు భరిణికాన బాబూరావు హాజరై మాట్లాడారు. యాదవులంతా ఐక్యంగా ఉండాలన్నారు. యాదవ భవనం కోసం ఐక్యంగా కృషి చేయాలని పలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కరక సోమునాయుడు, నియోజకవర్గం అధ్యక్షుడు పంచదార్ల సూరిబాబు, నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి రాము యాదవ్, అనకాపల్లి, కశింకోట మండలాల అధ్యక్షులు పంచదార్ల కన్నారావు, కె.రాజు, నాయకులు వియ్యపు సింహాచలం, ఐతా రాము, మువ్వల రాము, బంధం చిన్న, వియ్యపు నూకరాజు, వాయిబోయిన ఈశ్వరరావు, యాదవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఏడు చోరీ కేసుల్లో ఆరుగురి అరెస్టు

పెందుర్తి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి క్రైమ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఏడు చోరీ కేసులకు సంబంధించి ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.ఐదు లక్షలు విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు ఆదివారం క్రైమ్ ఏసీపీ డి.లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ డి.సూరిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి, నరవ, విమాన్‌నగర్ ప్రాంతాల్లో రెండిళ్లల్లో వెండి ఆభరణాలు, కోడిపుంజులు, నాలుగు గ్యాస్ సిలిండెర్లు, వెల్డింగ్ మిషన్, ఎలక్ట్రిక్ మిషన్లు, వైర్ల చోరీకి పాల్పడిన గోపాలపట్నంలోని కొత్తపాలేనికి చెందిన సుశాంత్ సాహూ (39), నగరంలోని కొబ్బరితోటకు చెందిన జగన్నాథ్ సాహూ(26) లను అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. అలాగే పెందుర్తి, అక్కిరెడ్డిపాలెంలలో పది కోళ్లను దొంగిలించిన విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన రావుల రమణ, నాగలూరి నాగరాజు, దొడ్ల ఈశ్వరరావులను అరెస్టు చేసినట్టు వారు తెలిపారు. సుజాతనగర్‌లో గల ఓ జ్యూస్ సెంటర్‌కు చెందిన స్టీల్ కౌంటర్‌ను చోరీ చేసిన చినముషిడివాడకు చెందిన కోనూరు రవిశంకర్‌ను అరెస్ట్ చేశామన్నారు. ఆయా కేసులను పెందుర్తి క్రైమ్ పోలీసులు చురుగ్గా దర్యాప్తు చేసి తక్కువ వ్యవధిలోనే నిందితులను పట్టుకుని, చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. కేసుల ఛేదనలో ప్రతిభ కనబరిచిన క్రైమ్ ఎస్‌ఐ సూరిబాబు, సిబ్బంది నాగరాజు, ఎంఎస్ నాయుడు, శ్రీరామ్, భవానీ, శివప్రసాద్, దేవుడు, ఎల్ఎస్ నాయుడు, పైడిరాజులను ఏసీపీ లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు అభినందించారు.

20 ఎకరాల్లో క్రీడా మైదానం ఏర్పాటుకు కృషి

- కరాటే పోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే కొణతాల



ఎమ్మెల్యే కొణతాల నుంచి ప్రథమ బహుమతి అందుకుంటున్న అనకాపల్లి క్రీడాకారుల బృందం

అనకాపల్లి టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం అనకాపల్లిలో 20 ఎకరాల స్థలంలో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేసి, క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు ఇక్కడి రైతు భారతి ఆడిటోరియంలో రాష్ట్ర ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల ముగింపోత్సవాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌లు క్రీడారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు.

అనకాపల్లి ఇండోర్ స్టేడియంలో పనులు వేగవంతం అయ్యేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడుతామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఆడ పిల్లలు బయట ప్రపంచంలో ధైర్యంగా ఉం డాలంటే తల్లిదండ్రులు వారికి ఇటువంటి మార్షల్ ఆర్ట్స్ నేర్పించాలన్నారు. అనంతరం విజేతలకు వారు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో అనకాపల్లి బృం దం ప్రథమ బహుమతి దక్కించుకుంది. ద్వితీయ బహుమతిని విజయవాడ, తృతీయ బహుమతిని విశాఖపట్నం స్వర్ణభారతి బృందాలు కైవసం చేసుకున్నాయి. అలాగే వివిధ విభాగాల్లో గెలుపొందిన విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్‌లను అందజేశారు. విజయవాడ, గుంటూరు, విశాఖ, అనకాపల్లి, శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాల నుంచి నాలుగు వందల మంది కరాటే క్రీడాకారులు ఈ పోటీలకు హాజరైనట్టు నిర్వాహకులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ తీక్షిత షటోకాన్ కరాటే అసోసియేషన్ చీఫ్ కోచ్ ఎస్‌పీఎండీ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, ఎస్‌డీ గ్రూప్స్ అధినేత కాండ్రేగుల శ్రీరామ్, ఎస్.బాబితో పాటు ఎస్‌పీఎండీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాటక రంగాన్ని అంతా ప్రోత్సహించాలి

రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా



వర్క్ ఫ్రమ్ హోమ్ నాటికలో ఓ సన్నివేశం



జ్యోతి వెలిగించి నాటికలను ప్రారంభిస్తున్న పీలా గోవింద

అనకాపల్లి టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నాటకరంగాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో జార్జిక్లబ్, హైదరాబాద్ కళావిపంచి, తెలుగు డ్రామా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటకోత్సవాలను ఆదివారం రాత్రి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటకాలు తిలకించడం వల్ల ఎంతో అనుభూతి పొందుతారన్నారు. అలాగే తెలుగు నాటక రంగం నుంచి ఎంతోమంది ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందారన్నారు. కూటమి ప్రభుత్వ కళారంగాన్ని ప్రోత్సహిస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బీఎస్ఎంకే జోగినాయుడు, బుద్ద కాశీవిశ్వేశ్వరరావు, పలువురు కళాకారులు పాల్గొన్నారు. ఉత్తమ కళాకారులకు పీలా గోవింద సత్యనారాయణ చేతుల మీదుగా సత్కారం నిర్వహించారు. అనంతరం బాపట్ల జిల్లా సహృదయ ద్రోణాదుల కళాకారులు ప్రదర్శించిన 'వర్క్ ఫ్రమ్ హోమ్', చిలకలూరిపేట వారి 'ఇంట్లో మహాభారతం' నాటికలు ప్రేక్షకులను ఆలోచింపజేశాయి.

కేంద్ర మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి

- అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు : సీపీఐ నాయకుడు దొరబాబు



బుద్ధుని విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

తుమ్మపాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలపై ఆదివారం ఆ పార్టీ నాయకులు ఆదివారం ఇక్కడి నెహ్రూచౌక్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమిత్ షాను కేంద్ర క్యాబినెట్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం మీద విశ్వాసం లేని ఆయన ఆ పదవికి అనర్హుడుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.బాబ్జి, కోరిబిల్లి శంకర్రావు, వీరుయాదవ్, సత్యనారాయణ, సింహాద్రి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

132 మందికి కంటి వైద్య పరీక్షలు



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పరవాడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : హిందుస్థాన్ షిప్ యార్డు ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఆదివారం వాడచీపురుపల్లిలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తొలిత ఈ శిబిరాన్ని మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు ప్రారంభించారు. కంటి సమస్యలు ఉన్న వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. మొత్తం 132 మంది హాజరుకాగా, వైద్యురాలు మధులిక పర్యవేక్షణలో వైద్యం బృందం పరీక్షలు జరిపారు. వీరిలో నలభై మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. ఫౌండేషన్ క్యాంప్ మేనేజర్ ఎం.అరుణ్‌కుమార్, ఆప్తాలమిక్ ఆఫీసర్‌అరుణ పాల్గొన్నారు.

ఘనంగా రామానుజన్ జయంతి

అనకాపల్లి టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ భారతీయ గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు పూలమాల వేసి నివాళులర్పించారు. రామానుజన్ చేసిన కృషిని గుర్తు చేసుకుని నేటి విద్యార్థులు గణిత శాస్త్రంపై మరింత అవగాహన పెంచుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. రామానుజన్ సంఖ్యా సిద్ధాంతంపై చేసిన వివిధ సమీకరణాలు చూపించే పోస్టర్‌ను రూపొందించి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

11 మద్యం బాటిళ్లు తరలిస్తున్న వ్యక్తిపై కేసు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సుంకరమెట్ట జంక్షన్ వద్ద ఆదివారం తనిఖీలు నిర్వహిస్తుండగా, ఒక వ్యక్తి వద్ద నుంచి పదకొండు మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు, అతనిపై నమోదు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. నక్కపల్లి మండలం పాటిమీద గ్రామానికి చెందిన పెంటకోట నాని మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి రోడ్డుపై వస్తున్నాడన్నారు. అతనిపై అనుమానం వచ్చి వచ్చి తనిఖీ చేశామన్నారు. అతని వద్ద పదకొండు మద్యం బాటిళ్లు లభ్యం కావాడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

వర్షాలకు తడిసిన వరి పనలపై ఉప్పు ద్రావణం చల్లాలి

సబ్బవరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం ప్రభావం కారణంగా కురిసిన వర్షాలకు తడిచిన వరి చేనుపై ఉప్పు ద్రావణం చల్లడం వలన కొంతవరకు నష్టాన్ని తగ్గించుకోవచ్చునని మండల వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ ఆదివారం సూచించారు. పంట కోసిన తరువాత పొలంలో ఉంచిన వరి పనలు తడిస్తే పొలం గట్టుపైకి చేర్చాలన్నారు. అనంతరం లీటరు నీటికి ఐదు గ్రాముల చొప్పున కల్లు ఉప్పును కలిపి గింజలు పూర్తిగా తడిసే విధంగా పిచికారీ చేయాలన్నారు. ఈ విధంగా చేయడం వలన గింజ మొలకెత్తకుండా ఉండడమే కాకుండా ధాన్యం రంగు మారకుండా ఉంటుందని వివరించారు. వర్షాలు తగ్గిన వెంటనే నూర్పిడి చేయాలని సూచించారు.



ఇరువాడలో నీట మునిగిన వరి పనలు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ఆదినారాయణ మహిళా కళాశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థినులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఆదినారాయణ మహిళా కళాశాలలో 1988- 93 విద్యా సంవత్సరాల మధ్య ఇంటర్, బీఏ ఆర్ట్స్ గ్రూపులో విద్యనభ్యసించిన విద్యార్థినులు గవరపాలెం గౌరీ సేవా సంఘం మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో ఆది వారం కలుసుకున్నారు. బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నం, శ్రీకాకుళం వంటి ప్రాంతాల నుంచి ఇక్కడకు విచ్చేసి తమ తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకునేందుకున్నారు. తమకు విద్య నేర్పిన ఆదినారాయణ మహిళా కళాశాల అధ్యాపకులు ఇందిర, రత్నమాల, కనకదుర్గ, పద్మకుమారి, కమల, వెంకటలక్ష్మి, విజయలను విద్యార్థినులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు సతీమణి మాధవీలతతో పాటు కాండ్రేగుల శ్రీలక్ష్మి, కొణతాల జ్యోతి, కర్రి పద్మావతి, బుద్ద భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అలాగే, పట్టణంలోని మున్సిపల్ గవరపాలెం ఉన్నత పాఠశాలలో 1979-80 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం కుటుంబ సభ్యులతో స్నేహ గవరపాలెం మరిడిమాంబ ఆలయం వద్ద కలుసుకున్నారు. తొలుత ఒకరికొకరు పలకరించుకొని నాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. అనంతరం సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ఆదర్శ దంపతులకు బహుమతులు అందించారు. నిర్వాహకులు ఆడారి రామారావు, ఇబ్రహీం, విల్లూరి రామకృష్ణ, శరగడం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మున్సిపల్ గవరపాలెం ఉన్నత పాఠశాలలో కుటుంబ సభ్యులతో...

క్వారీ వద్ద డ్రైవర్ మృతి

- నోటి నుంచి రక్తం రావడంతో కుటుంబ సభ్యుల్లో అనుమానాలు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



మృతి చెందిన సన్యాసిరావు

తుమ్మపాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం బవులవాడ పంచాయతీ దర్జీనగర్‌లో నివాసముంటున్న చవితిని సన్యాసిరావు (45) ఆదివారం గ్రామంలో గల క్వారీ వద్ద మృతి చెంది ఉన్నాడు. ఇందుకు సంబంధించి కుటుంబ సభ్యులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాలివి. గత కొన్నేళ్లుగా సన్యాసిరావు బవులవాడ పంచాయతీ పరిధి దర్జీనగర్‌లో కుటుంబంతో నివాసముంటున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. డ్రైవర్ వృత్తిలో కొనసాగుతున్న ఈతడు శనివారం బవులవాడలో గల ఒక క్వారీలో విధులు నిమిత్తం వెళ్లాడు. ఆదివారం వరకు అతని నుంచి కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం లేదు. తెల్లవారుజామున సహచర డ్రైవర్లు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సన్యాసిరావు క్వారీ సమీపంలో మృతి చెంది ఉన్నాడని సమాచారం ఇచ్చారు. దీంతో వారంతా కన్నీరుమున్నీరుగా విలపిస్తూ అక్కడికి వెళ్లి పరిశీలించారు. మృతుడి నోటి వెంబడి రక్తం వచ్చి ఉండడంతో పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అలాగే క్వారీ, లారీ యాజమాన్యాలు నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందాడని వారు ఆరోపించారు. దీనిపై సమాచారం అందుకున్న రూరల్ సీఐ అశోక్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పలు వురు నుంచి వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. సన్యాసిరావు మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. మృతుని భార్య ఆశాజ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రూరల్ సీఐ అశోక్‌కుమార్

భరణికంలో మరొకరికి అతిసార

- గ్రామంలో కొనసాగుతున్న వైద్య శిబిరం



పరవాడ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న సుంకర రమణమ్మ

పరవాడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భరణికం గ్రామంలో ఆదివారం మరొకరు డయేరియా బారిన పడ్డారు. వారం రోజుల వ్యవధిలో 22 మందికి ఈ వ్యాధి ప్రబలి వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొంది సాధారణ స్థితికి రావడంతో 20 మంది ఇళ్లకు చేరుకున్నారని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాయిరాం తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన సుంకర రమణమ్మ ఆదివారం ఉదయం నుంచి విరేచనాలు కావడంతో కుటుంబ సభ్యులు పరవాడ పీహెచ్‌సీకి తరలించారు. ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉందని తెలిపారు. గ్రామంలో అతిసార కేసులు నమోదు కావడంతో వైద్యశిబిరాన్ని కొనసాగిస్తున్నారు. అతిసార లక్షణాలు ఉంటే తక్షణమే పీహెచ్‌సీకి రావాలని వైద్యులు సూచిస్తున్నారు.

'తూర్పు కాపులు సమష్టిగా ముందుకు సాగాలి'



ప్రగడ, పప్పల, ఎమ్మెల్యేవిజయ్‌కుమార్‌లను సత్కరిస్తున్న దృశ్యం

ఎలమంచిలి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పు కాపులంతా ఐకమత్యంతో ఉంటూ సామాజ హితం కోసం ముందుకు సాగాలని రాష్ట్ర రహ దారుల కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరావు, ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. ఆదివారం ఎలమంచిలి సమీపాన పోలిమేరమ్మతల్లిఆలయ వద్ద తోటలో తూర్పుకాపుల వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు, వ్యాపారులు, వేలాది సంఖ్యలో తూర్పు కాపులు పాల్గొన్నారు. ప్రగడ నాగేశ్వరావు, ఎమ్మెల్యే సుందరపు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, ఎంపీపీ బోదెపు గోవింద్, మునిసిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరావు, మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, పలువురు కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నేతలను తూర్పు కాపు అసోసియేషన్ ప్రతినిధులంతా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చిన్నారులు, మహిళలకు వివిధ సాంస్కృతి పోటీలు నిర్వహించి బహుమతులందించారు. సంఘ ప్రతినిధులు, సభ్యులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	590
విజయనగరం	594
శ్రీకాకుళం	594

వాహన చోదకులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: సీఐ


మాట్లాడుతున్న సీఐ వినోద్ బాబు

చింతపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. వినోద్ బాబు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. చింతపల్లి సబ్ డివిజన్ కేంద్రంలో కావడంతో ట్రాఫిక్ పెరిగిపోయిందన్నారు. వారపు సంత రోజు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు డీఎస్పీ షేక్ సహబాజ్ అహమ్మద్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారన్నారు. గిరిజన ప్రాంతంలో డ్రైవింగ్ లైసెన్సు లేకుండగా ఏ ఒకరు వాహనాలు నడపరాదన్నారు. అతివేగంగా వాహనాలు నడిపిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సర్వీసు వాహనాలు పరిమితికి మించిన ప్రయాణికులతో ప్రయాణించరాదన్నారు. వాహనాలకు సంబంధించిన రికార్డు పూర్తి స్థాయిలో ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. చింతపల్లిలో రహదారికి ఇరువైపులా అక్కడ వాహనాలను నిలపరాదన్నారు. ఆర్టీసీ బస్సులు, సర్వీసులు ఆటోలు, జీపులకు కేటాయించిన స్థలాల్లోనే పార్కింగ్ చేయాలన్నారు. బుధవారం వారపు సంత రోజు ప్రధాన రహదారి పూర్తిగా పోలీసుల స్వాధీనంలో ఉంటుందన్నారు. అంబులెన్సులు, ద్విచక్రవాహనాలు, అత్యవసర వాహనాలు మినహా ఇతరవాహనాలను పాతబస్టాండ్‌కి అనుమతించేదిలేదన్నారుఇతర వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పంపించేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటారన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

పెద్ద దేవుడికి ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న గిరిజనులు

డుంబ్రిగుడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతంగి గ్రామంలో జరుగుతున్న పెద్ద దేవుడు పండగ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో గిరిజనులు బారులు తీరారు. దేవునికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగే ఈ మహోత్సవాలను ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గిరిజన సంప్రదాయ నృత్యం థింసాతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఆదివాసీ మాతృభాషా ఉపాధ్యాయ రాష్ట్ర కమిటీ ఎన్నిక


నూతన అధ్యక్ష, కార్యదర్శులు ఆనందరావు, చిట్టిబాబు

పాడేరురూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈ నెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నందూరి ప్రసాదరావు భవనంలో జరిగిన ఆదివాసీ మాతృ భాషా ఉపాధ్యాయుల ఫీనరీ సవమావేశంలో మాతృ భాషా ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కమిటీని ఎంపిక చేశారు. రాష్ట్ర కమిటీ నూతన అధ్యక్షుడిగా సవర ఆనందరావు (సీతంపేట), ప్రధాన కార్యదర్శిగా మర్రి చిట్టిబాబు (పాడేరు), ఉపాధ్యక్షులుగా పాంగి శ్రీను (పాడేరు), కుంజా నవీన్ (కేఆర్.పురం), సవర డొంబు (సీతంపేట), సీదరి సత్తిబాబు (పాడేరు), పాంగి కుమారి (డుంబ్రిగూడ), కె.కుసుమకుమారి (పోలవరం), బి.గౌరి (కురుపాం), కుంబిడి రమేష్(అరకు), సీదరి జగన్ (పాడేరు), సహాయ కార్యదర్శులుగా ఎస్.సాగర్ (కేఆర్ పురం), ఎ.గంగరాజు (జీఎల్.పురం), పి. సుందరరావు (కొత్తూరు), ఎం.భారతి (సీతంపేట), కె.వీరయ్య (పెదబయలు), ఎస్.దేవి (ముంచంగిపుట్టు) తోపాటు రాష్ట్ర కమిటీ సభ్యులుగా మరో 19 మందిని నియమించారు. ఈ కార్యక్రమంలో పాంగి.శ్రీను, సవర డొంబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఈ సమావేశంలో గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స పాల్గొని మాట్లాడారు. ఆదివాసీ మాతృ భాషా ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ తెగలను ఉన్నత విద్యావంతులుగా మార్చేందుకు స్థానిక ఆదివాసీ మాతృ భాషా ఉపాధ్యాయులు రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. 2003లో ప్రారంభించిన ఆదివాసీ మాతృ భాష బోధనతో రాష్ట్రంలో 45 శాతం నుంచి 49 శాతానికి ఆదివాసీ అక్షరాస్యత పెరిగిందన్నారు.


హుకుంపేట పాత మంచి నీటి కుండి పరిసరాల్లో చెతాచెదారాలు


అడ్డుమండ రోడ్డులో దుస్థితి

హుకుంపేటలో ఎక్కడ చూసినా చెత్తా చెదారాలే!

- పారిశుధ్య లోపంతో ప్రబలుతున్న వ్యాధులు
- పంచాయతీ నిర్లక్ష్యం.. గ్రామస్థుల ఆందోళన

హుకుంపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రమైన హుకుంపేటలో పంచాయతీలో పారిశుధ్యం అధ్వాన స్థితిలో ఉంది. పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో ఎక్కడిక్కడ చెత్తాచెదారాలు పేరుకుంటున్నాయి. స్థానిక రామాలయం గుడి సమీపంలో అడ్డుమండ రోడ్డు వైపు ఉన్న పాత మంచిట్యాంక్ వద్ద వ్యర్థాలతో నిండి పోయి డంపింగ్ యార్డును తలపిస్తోంది. ఫలితంగా తీవ్ర దుర్వాసన వెలువడుతూ పరిసరవాసులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. మెయిన్‌రోడ్డులోని వ్యాపారులు చెత్తాచెదారాలను ఈ నీటి కుండీల్లో వేస్తున్నారు. ఈ వీధిలో తాగునీటికి ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఇక్కడ ఉన్న బోరు మరమ్మతుల పాలైంది. మిగిలిన పలు వీధుల్లో కాలువలు పూడికలతో నిండి పోయి ఉంటున్నాయి. ఫలితంగా మలేరియా, డెంగ్యూ తదితర జ్వరాలు ప్రబలుతున్నట్టు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వం కనీసం పంచాయతీలను పట్టించుకోలేదు. నిధులు విడుదల చేయకపోవడంతో సమస్య నెలకొనేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పంచాయతీలకు ఎంతో కొంత నిధులు నిధులు విడుదల చేస్తున్నా గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టడంతో నిర్లక్ష్యం వహిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్‌చేస్తున్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- ఐటీడీఏ పీవో అభిషేక్

హుకుంపేట డిసెంబరు 22 ఆంధ్రజ్యోతి; గిరిజన మహిళలు నైపుణ్యాభివృద్ధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. మండలంలోని ఆదివారం తాడిపుట్టు పంచాయతీ గడుగుపల్లి గ్రామ సమీపంలో భగవాన్ శ్రీ సత్యసాయి ప్రేమామృతం వృత్తి నైపుణ్య అభివృద్ధి శిక్షణ, కేంద్ర బ్యాంకర్ల గ్రామీణాభివృద్ధి సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా సత్యసాయి బాబా ఆలయాన్ని సందర్శించారు. ప్రసాదం స్వీకరించారు. అనంతరం శిక్షణ కేంద్రం భవనాన్ని ప్రారంభించారు. మిషన్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు కుట్టు శిక్షణ పొంది ఆర్థికంగా ఎదగాలని కోరారు. పలు గ్రామాల నుంచి వస్తున్న మహిళలకు వసతి సదుపాయం కల్పిస్తున్నారు. ఈ శిక్షణకు ఇప్పటికి 70 మంది మహిళలు శిక్షణ పొందేందుకు రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు ఇలాంటి శిక్షణలు దోహపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి నాగప్రసాద్, సుబ్బారావు రాధాకృష్ణ, ప్రతాప్, మురళీ తదితరులు పాల్గొన్నారు.


సత్యసాయి నైపుణ్య శిక్షణ కేంద్రం ప్రారంభిస్తున్న పీవో అభిషేక్

'గణిత శాస్త్రవేత్త రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి'

పాడేరురూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఖ్యాతి గాంచిన గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ 137వ జయంతి వేడుకలను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ టీఎస్ రసూల్, అధ్యాపకులు ముందుగా ఆయన చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రసూల్ మాట్లాడుతూ ప్రపంచ గణిత మేధావులలో ఒకరైన రామానుజన్‌ని ప్రతీ విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గణితం బాగా అధ్యాయనం చేసిన విద్యార్థులకు మేధస్సు పెరుగుతుందన్నారు. అధ్యాపకులు శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కో- ఆర్డినేటర్ పి. కోటేశ్వరరావు, గణిత శాస్త్ర అధ్యాపకురాలు ప్రసన్న, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు : స్థానిక శారదా నికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గణిత మేధావి శ్రీనివాస్ రామానుజన్ జయంతి ఘనంగా నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. త సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్.మత్స్యరాజు మాట్లాడుతూ విద్యార్థులు గణిత శాస్త్రవేత్త రామాజనుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రాథమిక దశ నుంచి గణిత పరిజ్ఞానంపై మక్కువ చూపించాలని అన్నారు. ఏ రంగంలో రాణించాలన్నా లెక్కలు ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.డొన్నో, బి.ఉషారాణి, ఎం.రత్నకుమారి, బి.సంగీత, వి.కావ్య, పి.లక్ష్మీ, ఎ.కవిత తదితరులు పాల్గొన్నారు.


ముంచంగిపుట్టులో రామానుజన్ చిత్రపటానికి నివాళర్పిస్తున్న ఉపాధ్యాయులు


హుకుంపేటలో పొలాల్లో ఉన్న కోసిన వరి పనలు


నూర్పులు చేపడుతున్న రైతులు

వాయుగుండం హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన

- వర్షాలతో వరికి నష్టం
- త్వరితగతిన కోతలు, నూర్పులు పూర్తికి చర్యలు

హుకుంపేట డిసెంబరు 22 ఆంధ్రజ్యోతి; బంగాళాఖాతంలో వాయుగుండం హెచ్చరికలతో పలు గ్రామాల్లో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వర్షాలు కురుస్తాయని ఆలోచనలో ఆగమేఘాలతో వరి కోతలు పూర్తి చేయడం, కుప్పలు వేస్తున్నారు. కొందరు యంత్రాలతో నూర్పులు పూర్తి చేస్తున్నారు. దీంతో నూర్పు యం త్రాలకు డిమాండ్ నెలకొంది. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి చేలు తడిసి నష్టవాటిల్లింది. తిరిగి బంగాళాఖాతంలో వాయుగుండం నెలకొన్నట్టు వాతావరణ శాఖ హెచ్చరికలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. దీంతో రైతులు వరి కోతలు, నూర్పులపై ఆత్రుత పడుతున్నారు. మన్యం ప్రాంతంలో ఈ ఏడాది ఖరీఫ్ సాగు ఆశాజనకంగా ఉంది. ఈ ఏడాది వర్షాలు అనుకూలించంతో పంట కూడా బాగా దిగుబడి వస్తుందని అన్నదాతలు ఆశించారు. అయితే, వరుసగా ఇటీవల వర్షాలు కురుస్తుండంతో చేతికి వస్తుందన్న పంటకు నష్టం వాటిల్లుతోంది. రెండు రోజుల కిందట వాయుగుండం ప్రభావంతో వర్షాలు కురిశాయి. దీని వల్ల వరి చేలలో నీరు చేరింది. కొన్ని చోట్ల పనలు తడిపోయాయి. ఇవి ఆరపెడుతున్న సమయంలో మళ్లీ వాయుగుండం రావడంతో రైతులు హైరానా పడుతున్నారు. మళ్లీ వర్షాలుపడితే పెట్టిన పెడుబడులు కూడా రావని రైతులు వాపోతున్నారు. దీంతో పంటను పరిరక్షించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరంచేశారు. అలాగే, సామలు, రాగులు, రాజ్‌మా పంటలకు వర్షాలతో నష్టం వాటిల్లుతోంది.


టార్పాలిన్‌లతో కప్పిన వరికుప్పలు

ఆంధ్రా- ఒడిశా సరిహద్దు దాటడం సాహసమే!

- అసంపూర్తిగా పిల్లిగెడ్డ వంతెన అప్రోచ్ రోడ్డు నిర్మాణం
- రెండు పక్కలా రక్షణ గోడలు నిల్
- వాహనదారులకు పొంచి ఉన్న ప్రమాదం

సీలేరు, డిసెంబరు 22 , (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా ఒడిశా రాష్ట్రాలను కలిపే పిల్లిగెడ్డ వంతెన అప్రోచ్‌కు బీటీ వేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. ఆంధ్రా ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నిర్మాణానికి 1960 సంవత్సరంలో తూర్పు కనుముల మీదుగా రెండు రాష్ట్రాలను కలుపుతూ అప్పటి విశాఖ జిల్లాలోని సీలేరు మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ మధ్య గల 17 కిలోమీటర్ల రహదారిలో కాట్రగెడ్డ వరకు (చిత్రకొండ జంక్షన్ నుంచి కాట్రగెడ్డ వరకు) సుమారు 5 కిలోమీటర్ల రహదారిని అప్పటి ఏపీఎస్‌ఈబీ నిర్మించింది. ఈ రహదారితోపాటు పిల్లిగెడ్డ వాగుపై ఒక వంతెనను కూడా ఏపీఎస్‌ఈబీ నిర్మించింది. చిత్రకొండ జంక్షన్ నుంచి ఆంధ్రా సరిహద్దు ప్రాంతమైన కాట్రగెడ్డ వరకు గల 5 కిలోమీటర్ల రహదారి, పిల్లిగెడ్డ వంతెన నిర్వహణ పనులను 2005 వరకు ఏపీఎస్‌ఈబీ చేసుకునేది. ఆ తరువాత నుంచి ఆ రహదారిని పం చాయతీరాజ్‌కు అప్పగించారు. దీంతో పిల్లిగెడ్డ వంతెన చాలామేరకు శిథిలావస్థకు చేరుకోవడంతో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023లో రూ. 2.50 కోట్ల ఆర్‌సీపీఎల్ డబ్ల్యూఈ నిధుల తో వాగుపై కొత్త వంతెన మం జూరు చేసింది. గుత్తేదారుడు వంతెన పనులను మాత్రమే పూర్తి చేశారు. వంతెనకు ఇరువైపులా అప్రోచ్ పనులు, బీటీ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే ఈ ఏడాది సెప్టెంబరు 8వతేదీన తుఫాన్ ప్రభావంతో ఈ ప్రాం తంలో కురిసిన భారీ వర్షాలకు పిల్లిగెడ్డ ఉగ్రరూపం దాల్చడంతో వరద ఉధృతికి పాత వంతెన కొట్టుకుపోయింది. దీంతో ఆంధ్రా ఒడిశాకు నెలరోజులకు పైగా రాకపోకలు నిలిచిపోయాయి. ఈ స్థితిలో అధికారుల ఒత్తిడి మేరకు కొత్త వంతెనకు రెండు పక్కలా అప్రోచ్ పనులను శరవేగంగా చేపట్టి రాకపోకలను పునరుద్ధరించారు. కానీ, ఇటీవల అల్పపీడనల ప్రభావంతో ఈ ప్రాంతంలో అధికంగా వర్షాలు కురుస్తుండడంతో అప్రోచ్ బురదమయంగా మారిలోడు వాహనాలు రాకపోకలకు ప్రమాదంగా మా రింది. అప్రోచ్‌కు రెండు పక్కలా రక్షణగా గోడలను ఐరన్ చానల్ ను ఏర్పాటు చేయాలని, లేకుంటే ప్రమాదాలు సంభవించే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


అప్రోచ్ కు బీటీ వేయాల్సిన పిల్లిగెడ్డ కొత్త వంతెన


వంతెనకు రెండు పక్కలా రక్షణ గోడలు లేని దృశ్యం

'కేంద్ర హోం మంత్రి క్షమాపణ చెప్పాలి'


అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

పెదబయలు,డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమీత్‌షా క్షమాపణలు చెప్పాలని గిరిజన సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ పార్కు వద్ద గిరిజన సంఘం ఆధర్యంలో వివిధ సంఘాల నేతలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాక్షాత్తు పార్లమెంట్ సాక్షిగా అంబేడ్కర్‌ను అవమానిస్తు అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ఇటువంటి దుర్మార్గమైన చర్యకు పాల్పడిన అమిత్‌షా ప్రధాని మోదీ పార్లమెంట్ నుంచి బర్తరఫ్ చేయాల్సింది పోయి ఆయనను వెనకేసుకురావడం దారుణమన్నారు. అలాగే, అమిత్‌షాపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సన్నిబాబు,.దర్శనపడాల్, రవిశంకర్, కృష్ణబాబు, సునీల్‌కుమార్, జగత్‌రాయ్,రాధాకృష్ణ, చంద్రుబాబు, కోటి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో ప్యానెల్ 2 విజయం


విజయం సాధించిన ప్యానెల్ 2 అభ్యర్థులు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం విశాఖ జిల్లాకు ఎంవీపీ కాలనీ గిరిజన్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో ప్యానెల్ 2 విజయం సాధించింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో విశాఖ జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న గిరిజన ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలీసు, జీసీసీ, రైల్వే, సచివాలయం, పోర్టు ట్రస్టు, డాక్‌యార్డు, ఆర్ఐఎన్ఎల్, జీవీఎంసీ తదితర ప్రభుత్వ సంస్థల ఉద్యోగులు ఉదయం నుంచి గిరిజన్ భవన్ ముందు సందడి చేశారు. సంఘంలో మొత్తం 2234 మంది సభ్యులు కాగా, 1469 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్యానెల్ 1 అరటి పండు గుర్తుతో డిప్పల సాంబమూర్తి అధ్యక్షుడిగా పోటీ చేయగా, ప్యానెల్ 2గాలిపటం గుర్తుతో ఎస్.అప్పలరాజు పోటీలో పోటీ పడ్డారు. ఈ ఎన్నికలో 81 ఓట్ల తేడాతో ప్యానెల్ 2 విజయం సాధించింది.

బాధిత కుటుంబానికి జీసీసీ చైర్మన్ శ్రావణ్ కుమార్ సాయం

డుంబ్రిగుడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటగన్నేల పంచాయతీ పింపోల్‌గుడ గ్రామానికి చెందిన కోర్రా రాజుబాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయాన్ని తెలుసుకున్న జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్ బాధిత కుటుంబానికి ఆర్థిక సాయాన్ని ఆపార్టీ నాయకుల ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో అరకు అసెంబ్లీ సభ్యత నమోదు సమన్వయకర్త రాజ్‌కుమార్, యూనిట్ ఇన్‌చార్జి జక్కయ్య, పరశురాం లక్ష్మణ్,తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా చేపల చెరువులు

... 5వ పేజీ తరువాయి

చెరువుల నిర్వహణకు మత్స్యశాఖ, పోలీసు, రెవెన్యూ అధికారుల నుంచి అనుమతులు పొందాల్సి ఉన్నా నిర్వాహకులు పట్టించుకోకపోవడం, అధికారులు కూడా చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది.

చేపల చెరువులకు అనుమతులు లేవు

చేపల చెరువుల నిర్వహణకు ఎవరూ అనుమతులు తీసుకోలేదని, అనుమతులు తీసుకోవాలని 15 మంది చేపల చెరువుల యజమానులకు నోటీలు ఇచ్చామని మత్స్య శాఖ ఏడీ ప్రసాదరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇటీవల తారువలో కోళ్ల వ్యర్థాలను పట్టుకొని, వాటిని ధ్వంసం చేసి రవాణా చేస్తున్న ఆటోను పోలీసులకు అప్పగించామన్నారు. ఇక్కడ పెంచుతున్న చేపలు పంగస్ రకానికి చెందినవి ఆయన తెలిపారు.

అధికారులు పట్టించుకోవడం లేదు

చేపల చెరువులపై అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న ఆరోపించారు. కోళ్ల వ్యర్థాలను పట్టపగలే మాంసం దుకాణాల నుంచి తీసుకు వెళుతుంటే పట్టుకొని పోలీసులకు అప్పగించాల్సి వస్తుందన్నారు. సచివాలయాల సిబ్బంది కూడా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

అనకాపల్లిలో రైతుబజార్ ఏర్పాటయ్యేనా?

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటుకు అప్పట్లో ప్రజాప్రతినిధులు చర్యలు ప్రారంభించారు. విజయవాడ నుంచి మార్కెటింగ్‌శాఖ అధికారులు అనకాపల్లికి వచ్చి రైతుబజార్‌కు అవసరమైన స్థలాల కోసం అన్వేషణ చేశారు. గాంధీమార్కెట్‌కు ఎదురుగా ఉన్న డీసీఎంఎస్ స్థలం పరిశీలించారు. అయితే ఆ స్థలాన్ని డీసీఎంఎస్ ఇవ్వడానికి అంగీకరించలేదు. ఆ తరువాత అరటి, కొబ్బరికాయల మార్కెట్ స్థలాన్ని కూడా పరిశీలించారు. అయినా ప్రయోజనం లేకపోయింది. ఆ తరువాత ప్రభుత్వం మారడంతో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అనకాపల్లికి రైతుబజారును మంజూరు చేస్తూ 2021 మార్చి 5వ తేదీన మార్కెటింగ్‌శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే రైతుబజార్ ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. ఇప్పటికీ స్థల సమస్య కొలిక్కి రాకపోవడంతో రైతుబజార్ ఏర్పాటు ప్రశ్నార్థకంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అయినా రైతుబజార్ అందుబాటులోకి వస్తుందని అందరూ ఆశగా ఎదురుచూస్తున్నారు. దీనిపై మార్కెటింగ్‌శాఖ జిల్లా అధికారి రవికుమార్ వివరణ కోరగా గతంలో అధికారులు అరటి, కొబ్బరికాయల మార్కెట్ స్థలాన్ని పరిశీలించారని, ఆ స్థలం జీవీఎంసీది కావడంతో లేఖ రాసినట్టు చెప్పారు. జీవీఎంసీ ఆ స్థలాన్ని కేటాయించినట్టయితే రైతుబజార్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

అడవి... అంతరిస్తోంది

... 5వ పేజీ తరువాయి

ముగిసిన తరువాత వాతావరణంలో మార్పుల కారణంగా అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయి. అనకాపల్లి జిల్లాలో 2022 నవంబరు నుంచి 2023 జూన్ వరకు 194 అగ్ని ప్రమాదాలు సంభవించగా, 2023 నవంబరు నుంచి 2024 జూన్ వరకు 126కు తగ్గాయి. విశాఖ జిల్లాలో 2022 నవంబరు నుంచి 2023 జూన్ వరకు మూడు, 2023 నవంబరు నుంచి 2024 జూన్ వరకు నాలుగు ప్రమాదాలు సంభవించాయి.

అర్బన్‌లో విశాఖ ప్రథమ స్థానం

జిల్లాలో భీమిలి నుంచి అనకాపల్లి వరకు 615.53 చ.కి.మీ. విస్తీర్ణంతో విస్తరించిన విశాఖ నగరం జనసమ్మర్ధంగా ఉంటుంది. అటువంటి మహానగరంలో అడవుల విస్తీర్ణం ఎక్కువ. రాష్ట్రంలో ఎక్కువగా అటవీ విస్తీర్ణం ఉన్న పట్టణాలు/నగరాల్లో విశాఖపట్నం ప్రథమస్థానంలో ఉంది. నగరంలో 68.59 చ.కి.మీ. విస్తీర్ణంలో మధ్యస్థాయి అడవి ఉండగా ఓపెన్ ఫారెస్టు 114.10 చ.కి.మీ. మేర విస్తరించాయి. మొత్తం 182.69 చ.కి.మీ. అటవీ విస్తీర్ణం ఉంది. మొత్తంలో అటవీ విస్తీర్ణం 29.68 శాతంగా ఉంది. నగరంలో కంబాల కొండ ఒక్కటే 1400 హెక్టార్లలో విస్తరించింది. జూ, సింహాచలం కొండ, విశాఖ ఉక్కు టౌన్‌షిప్, ఆంధ్రవిశ్వవిద్యాలయం, పార్కుల్లో లక్షల చెట్లతో పచ్చదనం నిండి ఉంది. హుద్‌హుద్ తరువాత నాటిన మొక్కలు వృక్షాలుగా ఎదగడంతో పచ్చదనం పరచుకుంది. వీటన్నింటిని కలిపి ఓపెన్ ఫారెస్టుగా గుర్తిస్తారు. అయినా నగరంలో కాలుష్యం, వేసవిలో వేడి తగ్గాలన్నా మరిన్ని మొక్కలు పెంచాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

పలు రైళ్లు ఆలస్యం

... 5వ పేజీ తరువాయి

లేకపోయినా నిలిపివేయడం పట్ల ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురయ్యారు. ఒకటో ప్లాట్‌ఫారంలో కనీసం బిస్కెట్లు, కూల్‌డ్రింక్‌లు తప్ప మరే ఫలహారాలు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. 11 గంటల తరువాత విశాఖలో విద్యుత్ తీగలు సరి చేయడంతో ఆ తరువాత నుంచి రైళ్లు యథావిధిగా రాకపోకలు సాగించాయి.

పాడి రైతులకు సంక్రాంతి బోనస్ పంపిణీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

మాడుగుల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తులసీ కల్యాణ మండపంలో ఆదివారం పాడి రైతులకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చేతుల మీదుగా సంక్రాంతి బోనస్ పంపిణీ చేశారు. డెయిరీ మండల కార్యదర్శి గండి జోగినాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పాడి రైతులను విద్య, వైద్య రంగంలో డెయిరీ సేవలు అందించడం అభినందనీయమన్నారు. డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ రైతులను ఆదుకోవడమే డెయిరీ లక్ష్యమని అన్నారు. ఇకపై సంక్రాంతితో పాటు ఉగాదికి కూడా బోనస్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, డెయిరీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షల్లో సత్తా చాటాలి

- వసతిగృహ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ
- బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రాజేశ్వరి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ బి.రాజేశ్వరి

చోడవరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు సత్తా చాటాలని బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బి.రాజేశ్వరి సూచించారు. స్థానిక ఉషోదయ కళాశాలల చోడవరం, మాడుగుల నియోజక వర్గాలకు చెందిన బీసీ వెల్ఫేర్ హాస్టళ్లల్లో ఆదివారం టెన్త్ విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థుల పట్ల వార్డెన్లు ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. టెన్త్ విద్యార్థులకు అట్టలు, క్రీడా సామగ్రిని పూర్వ విద్యార్థులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏబీసీడబ్ల్యూ నరసింహులు, బీసీ హాస్టళ్ల వార్డెన్లు పాల్గొన్నారు.

'పోరాట యోధుడు నూకినాయుడు'



నూకినాయుడు స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

కృష్ణాదేవిపేట, డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): గిరిజన, మైదాన ప్రాంతాల ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేసిన యోధుడు కామ్రేడ్ లగుడు నూకినాయుడు అని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేకా సత్యనారాయణ కొనియాడారు. నూకినాయుడు వర్ధంతిని సందర్భంగా మెయిన్ రోడ్డు పక్కన ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం అనేక పోరాటాలు చేసిన నూకినాయుడు ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మేకా భాస్కరరావు, నాయకులు రాధాకృష్ణ, మేకా సత్యనారాయణ, లగుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు లీకవుతున్నా పట్టించుకోరా..?



గౌతమ్‌నగర్ వాటర్ ట్యాంకు నుంచి వృథాగా పోతున్న తాగునీరు

చీడికాడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కోనాం శివారు గౌతమ్‌నగర్ కాలనీలో వాటర్ ట్యాంకు 15 రోజులుగా లీకవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల తాగునీటికి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సమస్యను పంచాయతీ అధికారులకు తెలిపినా ఏమాత్రం స్పందించడం లేదని కాలనీ వాసి మట్టా బాబూరావుతో పాటు పలువురు గ్రామస్థులు విలేకరులకు తెలిపారు. లీకేజీ వల్ల నీరు వృథాగా పోతుండడంతో పాటు ఆ ప్రాంతమంతా బురదమయంగా మారుతున్నదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే లీకేజీని అరికట్టాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని వారు విన్నవించారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి ఎస్.సింహాచలంనాయుడును వివరణ కోరగా, మూడు రోజుల్లో బాగు చేయిస్తానని తెలిపారు.

మాడుగులలో తెరిపినిచ్చిన వాన

మాడుగుల రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు ఆదివారం తెరిపిచ్చాయి. దీంతో మండల ప్రజలు, రైతులు ఊపిరి తీసుకున్నారు. కోసిన వరి చేను పొలాల్లోనే ఉండిపోవడంతో కుప్పలు పెట్టేందుకు రైతులు ఆపసోపాలు పడ్డారు. దీంతో వారు ఎప్పుడు వర్షం తెరిపిస్తుందా, ఎండ ఎప్పుడు కాస్తుందా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం మాదిరిగా ఎండ కాయడంతో వరి పనలు ఆరబెట్టే పనుల్లో నిమగ్నమయ్యారు.

పెదబొడ్డేపల్లిలో వాలీబాల్ పోటీలు



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న రాజేశ్

నర్సీపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ సందర్భంగా పెదబొడ్డేపల్లిలో విజయ్, రాజేశ్ యువసేన ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను చింతకాయల రాజేశ్ ప్రారంభించారు. ఈ పోటీలు రెండు రోజులు పాటు జరుగుతాయని నిర్వాహకులు యాదగిరి దాసు తెలిపారు. టోర్నమెంట్‌లో 22 జట్లు పాల్గొంటాయని వారు చెప్పారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.15000, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు, తృతీయ బహుమతిగా రూ.5 వేలు అందజేస్తామని పేర్కొన్నారు.

మొలకెత్తిన వరి.. అన్నదాత గగ్గోలు

తుఫాన్ వర్షాలకు తడిచిన వరి చేను
కోత కోసిన వరి నుంచి మొలకలు
వర్షం నీటిలోనే అపరాల పంట
కన్నెత్తి చూడని వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు

ఆరుగాలం ఎంతో శ్రమించి పండించిన పంట చేతికందే సమయంలో రైతులను తుఫాన్ ముంచేసింది. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు పంట నేల పాలైంది. కోత కోసి పొలాల్లో ఉంచిన వరి పనల నుంచి ధాన్యం మొలకలు వచ్చేశాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు.



గంపవానిపాలెంలో నీటిలో నానిన వరి పనలను ఒడ్డుకు చేర్చుతున్న రైతులు... మొలకెత్తిన వరి

రావికమతం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సాగుగా 2,025 హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారు. ఆర్‌జీఎల్ రకం వరి మాత్రమే పండడం ఆలస్యం కావడంతో మిగిలిన పంట పండి చేతికందే సమయంలో దోమ పోటు,రెక్కరాల్చు పురుగు ఆశించి రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేశాయి. వీటిని అధిగమించి కోత కోసే సమయంలో తుఫాన్‌ల బెడద పట్టి పీడించింది. మూడు రోజులుగా తుఫాన్ వర్షాల కారణంగా కల్యాణపులోవ రిజర్వాయర్ కింద ఆయకట్టు భూముల్లోని పలు లోతట్టు ప్రాంతాల్లో ఇంకా నీరు వీడలేదు. దీంతో కోసిన వరి పనలు నీటిలో నాని మొలకలు వచ్చేశాయి. కోత కోసి మడులపై ఉన్న వరి మొలకలు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గంపవానిపాలెం, జెడ్.కొత్తపట్నం గ్రామాలలో కల్యాణపులోవ రిజర్వాయర్ కింద వందలాది ఎకరాల్లో కోసిన వరి పంట మడులపైనే ఉండిపోవడంతో తుఫాన్ వర్షాలకు పనలు నీటిలో నానిపోయి మొలకలు వచ్చాయి.

దీంతో ఏం చేయాలో దిక్కుతోచక రైతులు ఆందోళన చెందుతున్నారు. నష్టపోయిన తమకు కనీసం భరోసా కల్పించాల్సిన వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు ఇటువైపు నీసం చూడలేదని రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. తుఫాన్ ప్రభావం తగ్గడంతో ఇప్పటికే మొలకలు వచ్చిన వరి పనలను ఆదివారం కాసిన కాస్త ఎండకు గట్లపై ఆరబెట్టారు.

అపరాలకు తుఫాన్ దెబ్బ

వందలాది ఎకరాల మినుము
పైరులో చేరిన వర్షం నీరు



మత్స్యపురం, గుమ్మాళ్లపాడు గ్రామాల్లోని మినుము పంటలో చేరిన నీరు

తుఫాన్ ప్రభావం మినుము పంటపై భారీగా పడింది. మండలంలోని వందలాది ఎకరాల మినుము పైరు వర్షం నీటి ముంపులో ఉంది. దీంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఏటా ఖరీఫ్ వరి సాగు అనంతరం రైతులు వందలాది ఎకరాల్లో మినుము పంట వేస్తున్నారు. వరి పంట కోత కోసే ముందు మినుము విత్తనాలు చల్లడం వల్ల వరిని మళ్ల నుంచి పైకి మోసే సమయంలో విత్తనాలు బురదలో దిగి మొలకలు దృఢంగా వస్తాయి. మండలంలో ఇప్పటికే రెండు నుంచి నాలుగు ఆకుల దశలోకి మినుము మొక్కలు ఎదిగాయి. కొమిర, మత్స్యపురం ,గుమ్మాళ్లపాడు, గర్నికం, పెదపాచిల, మట్టవానిపాలె, మేడివాడ తదితర గ్రామాల్లో రైతులు మినుము సాగు ఆశాజనకంగా ఉంది. ఈ నేపథ్యంలో తుఫాన్ కారణంగా కురిసన వర్షాల వల్ల మినుము పైను నీట మునిగింది. మినుప మొక్క దశలోనే వర్షపు నీరు తాగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై వ్యవసాయాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

వరి పూర్తిగా నానిపోయి మొలకలు వచ్చాయి

-కూర్మస్వామి, రైతు, గంపవానిపాలెం



ఈ ఏడాది పంట బాగానే పండింది. ఈ దశలో తుఫాన్ ప్రభావంతో వర్షం కురవడంతో చేను తడిచి పోయింది. కోసిన వరి పంట పొలంలోనే ఉండడంతో వర్షపు నీటితో పాటు కల్యాణపులోవ రిజర్వాయర్ నీరు తోడై పనలు పూర్తిగా నానిపోయి మొలకలు వచ్చేశాయి. దీంతో తమ కష్టమంతా నేలపాలైంది.

ఆశలు నీటిపాలయ్యాయి

-జి.రాజుబాబు, జెడ్.కొత్తపట్నం



ఈ ఏడాది పంట కలిసి వస్తుందని పంట కల్లానికి చేర్చుకునే సమయంలో తుఫాన్ దెబ్బతీసింది. ముందు రోజే ఎకరం పొలం కోత కోసి మడిపై వదిలేయడంతో పనలు వర్షానికి నాని మొలకలు వచ్చేశాయి. అప్పులు చేసి పెట్టుబడి పెడితే ఇలా జరగడంతో ఏం చేయాలో తెలియడం లేదు. తమ ఆశలు, ఆనందం నీటి పాలయ్యాయి.

జగన్ అసెంబ్లీకి వెళ్లి సమస్యలపై మాట్లాడాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వెంకటేశ్వరరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నేత వెంకటేశ్వరరావు

నర్సీపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్ అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలపై గళం విప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వైవీ వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం సీపీఎం జిల్లా మహాసభలు రెండో రోజు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రతిపక్ష బాధ్యతగా వ్యవహించాలని, అసెంబ్లీకి వచ్చి వాణి వినిపించాలని సూచించారు. 2014-19 మధ్య కాలంలో విశాఖలో భూ కుంభకోణంపై టీడీపీ ప్రభుత్వం సిట్ వేసిందని, తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఇంకో సిట్ వేసిందని అన్నారు. రెండు సిట్‌ల నివేదికలు బయటకు రాలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రెండు సిట్ నివేదికలను బయట పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఎనిమిది లక్షల ఎకరాలు, జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి శంకుస్థాపన చేసి 20 ఏళ్లయినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి నిధులు సాధించి పథకాలు అమలు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిలో సురేంద్ర మాట్లాడుతూ మైదాన ప్రాంతంలోని ఎనిమిది మండలాల్లో 350 గిరిజన గ్రామాలు ఉన్నాయని, ఆయా ప్రాంతాల్లో గిరిజనులు విద్య, వైద్యం అందక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. నర్సీపట్నం కేంద్రంలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అప్పలరాజు, వెంకన్న, ప్రభావతి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అడిగర్ల రాజు పాల్గొన్నారు.

దిగజారుతున్న టమోటా ధర

మొన్నటి వరకు కిలో రూ.50కు పైనే... నేడు రూ.10
కృష్ణాదేవిపేటలో 30 కిలోల క్రేటు రూ.300-రూ.320కు అమ్మకాలు



కృష్ణాదేవిపేట మార్కెట్‌లో వ్యాపారుల కోసం ఎదురుచూస్తున్న రైతులు

కృష్ణాదేవిపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): టమాటా ధరలు రోజురోజుకూ దిగజారుతున్నాయి. నెల రోజులుగా ఆకాశాన్ని అంటిన ధరలు, ఒక్కసారిగా పతనమవుతున్నాయి. ప్రస్తుతం సామాన్యులకు అందుబాటులోకి వచ్చే విధంగా తగ్గుముఖం పడ్డాయి. కృష్ణాదేవిపేట మార్కెట్‌లో ఆదివారం క్రేటు (30 కిలోల) టమోటా పండ్లు రూ.300 నుంచి రూ.320 వరకు ధర పలికాయి. గత నెలలో ఇదే క్రేటు వెయ్యికు పైబడి అమ్మకాలు సాగాయి.

కృష్ణాదేవిపేట వారపు సంతకు కొయ్యూరు, గొలుగొండ మండలాల్లోని ఏఎల్‌పురం, చోద్యం, గరంపేట, లింగంపేట, పాడి, రత్నంపేట, కినపర్తి, వలసంపేట, భీమవరం, పి.మాకవరం, సీహెచ్‌నాగాపురం తదితర గ్రామాల రైతులు ఆదివారం వందలాది కిలోల టమోటాను తీసుకువచ్చారు. వ్యాపారులు ఆశించిన స్థాయిలో రాకపోవడం, వచ్చిన వారు కూడా సిండికేట్ కావడంతో ఒక్కసారిగా ధర పతనమైంది. క్రేటు (30 కిలోల) టమోటా పండ్లు రూ.300 నుంచి రూ.320 వరకు ధర పలికాయి. దీంతో కిలో రూ.10 రావడంతో రైతులు ఉసూరుమని వెనుదిరిగారు. కాగా, వ్యాపారులు మాత్రం కిలో రూ.20కి అమ్మకాలు చేస్తున్నారు. అయితే గత ఏడాదితో పోల్చిచూస్తే ఆదాయం బాగుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అరటి ధర పతనం

- గెల రూ.50 నుంచి రూ.100 మధ్య పలకడంతో రైతులు గగ్గోలు



ఏటిగైరంపేట మార్కెట్‌లో అరటి గెలలు

గొలుగొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏటిగైరంపేట గ్రామంలో అరటి గెలల ధరలు భారీగా పతనమయ్యాయి. ఆదివారం ఏటిగైరంపేట మార్కెట్‌లో అరటి గెల రూ.50 నుంచి రూ.100 మధ్య ధర పలకడంతో రైతులు ఆవేదన చెందారు. మండలంలోని ఏటిగైరంపేట, రావణాపల్లి, పాడి, ఎర్రన్నపాలెం, సీతకండి గ్రామాల్లో సుమారు రెండొందల హెక్టార్లలో అరటి పంట సాగు చేపట్టారు. అయితే రెండు నెలల క్రితం గెల రూ.300 పలకగా, ప్రస్తుతం రూ.50 నుంచి రూ.100 మధ్య ధర పలికిందని రైతులు వాపోయారు. ఈ మార్కెట్‌కు రాజమండ్రి, రావులపాలెం, తుని, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాకు చెందిన వ్యాపారులు వచ్చి అరటి గెలలు కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం గెలల ధరలు భారీగా పడిపోవడంతో రైతులకు పెట్టుబడి రాని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం శుభకార్యాలు లేకపోవడంతో ధరలు తగ్గాయని రైతులు అంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రాంబిల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధారభోగాపుం జంక్షన్ వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గోకివాడకు చెందిన యువకుడు ద్వారపురెడ్డి విజయ్ (20) మృతి చెందారు. ఈ సంఘటనకు సంబంధించి స్థానిక ఎస్‌ఐ నాగేంద్ర అందించిన వివరాలిలా ఉన్నాయి. సదరు యువకుడు విజయ్ గోకివాడ నుంచి అచ్యుతాపురంలోని ఆఫ్టింగ్ డ్రైవింగ్‌కు వెళ్తుండగా, ధారభోగాపుం జం క్షన్ వద్ద తెల్లవారుజామున4:30 గంటల ప్రాంతంలో నిర్లక్ష్యంగా రోడ్డుపై ఆపి ఉన్న లారీని ఢీకొట్టారు. దీంతో సదరు విజయ్ తలకు బలమైన గాయాలై సంఘటనా స్థలంలో మృతి చెందారు. మృతుడు విజయ్‌కు తల్లిదండ్రులు, అక్క ఉన్నారన్నారు. మృతుడు తండ్రి అమ్మునాయుడు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. విజయ్ మృతితో గోకివాడ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మద్యం సీసాలు తరలిస్తున్న వ్యక్తిపై కేసు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 22 (ఆంధ్ర జ్యోతి) : పట్టణంలోని సుంకరమెట్ట జంక్షన్ వద్ద ఆదివారం తనిఖీలు నిర్వహిస్తుండగా, ఒక వ్యక్తి వద్ద నుంచి పదకొండు మద్యం క్వార్టర్ బాటిళ్ల స్వాధీనం చేసుకుని కేసు, అతనిపై నమోదు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. నక్కపల్లి మం డలం పాటిమీద గ్రామానికి చెందిన పెంటకోట నాని మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి రోడ్డుపై వస్తున్నాడన్నారు. అతనిపై అనుమానం వచ్చి వచ్చి తనిఖీ చేశామన్నారు. అతని వద్ద పదకొండు మద్యం బాటిళ్లు లభ్యం కావాడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	590
విజయనగరం	594
శ్రీకాకుళం	594



చెత్త తరలించే ట్రాక్టర్ నడుపుతున్న కార్యదర్శి

పంచాయతీ కార్యదర్శి చె(చి)త్తశుద్ధి

చోడవరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిబద్ధత ఉంటే ఏ ఉద్యోగి అయినా ప్రజల మన్ననలు పొందుతారనడంలో సందేహం లేదు. తన డ్యూటీ కాదని ఉండిపోకుండా అవసరమైన సమయంలో ప్రజలకు ఉపయోగపడే పని చేయడానికి ముందుకు వచ్చే ఉద్యోగులు ఉన్నప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందడానికి అవకాశం ఏర్పడుతుంది. చెత్త ఎత్తే ట్రాక్టర్ డ్రైవర్ అనారోగ్యంతో విధులకు రాకపోవడంతో తన పని కాకపోయినప్పటికీ గౌరీపట్నం పంచాయతీ కార్యదర్శి పట్నాయక్ ఏకంగా చెత్తను తరలించే ట్రాక్టర్ డ్రైవర్ అవతారం ఎత్తారు. గ్రామంలో చెత్తను తరలించే పనిలో స్వీపర్లతో కలిసి పనిచేయడం గ్రామస్థులను ఆకట్టుకుంది. పారిశుధ్య కార్మికులతో కలిసి రెండు రోజులుగా వీధుల్లో ట్రాక్టర్‌తో చెత్తను తరలించే పని చేస్తుండడంతో కార్యదర్శి పట్నాయక్‌ను స్థానికులు అభినందించారు.

డిగ్రీ కళాశాలలో రామానుజన్ జయంతి

చోడవరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత మేధావి రామానుజన్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు గణితంలో రామానుజన్ అసాధారణ ప్రతిభను ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యకమంలో అధ్యాపకులు రత్న భారతి, మాల్యాద్రి, రఫియుద్దీన్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

టీడీపీ నేత లక్ష్మణరావు మృతి



లక్ష్మణరావు (ఫైల్)

కె.కోటపాడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొండుపాలెం గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ నాయకుడు బండారు లక్ష్మణరావు ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. లక్ష్మణరావు సతీమణి కనక మల్లేశ్వరి గ్రామ సర్పంచ్‌గా వ్యవహరిస్తున్నారు. సౌమ్యుడిగా పేరు ఉన్న లక్ష్మణరావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మణరావు మృతదేహం వద్ద నివాళులు అర్పించారు.

మోదకొండమ్మ ఆలయానికి విరాళం

మాడుగుల రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కోడూరు మోదకొండమ్మ ఆలయం అభివృద్ధికి స్థానిక భక్తులు రేణం శేషగిరి, లక్ష్మి దంపతులు రూ.15 వేలు విరాళంగా అందించారు. ఆలయ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి సంజీవరావుకు ఆదివారం ఈ నగదును అందించారు.

బాల వికాష్ గురువులకు శిక్షణ

దేవరాపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల బాల వికాష్ గురువులకు సత్య సాయి సేవా సమితి జిల్లా విద్యా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం శిక్షణ కార్యక్రమం జరిగింది. మండలంలోని కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా విభాగం సమన్వయకర్త మల్లాది జయ, ఫ్యాకల్టీ ప్రశాంతి, పద్మ విలువలతో కూడిన విద్యను పిల్లలకు అందించడం, నడవడిక, సత్ప్రవర్తన సమాజంలో ఎలా ఉండాలనే అంశాలను వివరించారు. విద్యా విభాగం జిల్లా ఇన్‌చార్జి స్వామినాయుడు, మండల ఇన్‌చార్జి ఆదిరెడ్డి చినకన్నబాబు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యమే కొండంత బలం

గొలుగొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఆత్మస్థైర్యమే కొండంత బలమని గురకుల కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ గురకుల కళాశాలలో విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై ఆదివారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. అలాగే ఆరోగ్యం మెరుగుపరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి కల్యాణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సంక్రాంతి కళ



జోగంపేటలో సందడి చేస్తున్న బుడగా జంగాలు

గొలుగొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బుడగా జంగాలు రావడంతో సంక్రాంతి కళ ఉట్టి పడింది. జోగంపేట, గొలుగొండ, కొత్తమల్లంపేట, సాలికమల్లవరం, శ్రీరాంపురం గ్రామాల్లో ఆదివారం బుడగా జంగాలు ఇంటింటికీ వెళ్లారు. దీంతో ఆయా గ్రామాల్లో కుటుంబీకులు తమ పూర్వీకులను గుర్తు చేసుకున్నారు. దీంతో గ్రామాల్లో సంక్రాంతి కళ ప్రారంభమైంది.